


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



అక్షర రాజముద్ర
www.rajamudranews.com
ప్రతి అక్షరం - ప్రజల కోసం | తెలుగు దిన పత్రిక
AKSHARA RAJAAMUDHRA | RNI No: TELTEL/2024/86684

| మేడ్చల్-మల్కాజ్‌గిరి | ఆదివారం | 19.10.2025 | సంపుటి : 2 | సంచిక :255 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | Sunday | 19.10.2025 | volume : 2 | Issue : 255 | Pages : 8 | Cost : 2/- |



## విలేకరులు కావలెను

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575


# ప్రశాంతంగా బీసీ బంద్

- బస్ డిపోల ముందు నేతల బైఠాయింపు
- బస్సుల బందుతో ప్రయాణికుల ఇబ్బంది
- బంద్‌లో పాల్గొన్న రాజకీయ పార్టీల నేతలు
- అంబర్‌పేటలో కిందపడ్డ హన్మంతరావు

## ర్యాలీలు.. రాస్తారోకోలతో ఆందోళన



బీసీలకు రిజర్వేషన్లలో న్యాయమైన వాటా కోసం బీసీ ఐకాస చేపట్టిన బంద్ తెలంగాణవ్యాప్తంగా ప్రశాంతంగా కొనసాగింది. అత్యవసర సేవలు మినహా మిగతా రంగాలన్నీ బంద్ పాటించాయి. ఈ బంద్‌కు రాష్ట్రంలోని కాంగ్రెస్, భాజపా, భారత రాష్ట్ర సమితి, సీపీఐ, సీపీఎం, టీజేఎస్, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ, మావోయిస్టు పార్టీలతోపాటు ఎమ్మార్పీఎస్, మాలమహానాడు, ఆదివాసీ, గిరిజన, మైనార్టీ, విద్యార్థి, ప్రజాసంఘాలు మద్దతు ప్రకటించాయి.

2 లో



# అందరి ఆమోదంతోనే ముందుకు సాగుతాం

## బిసి రిజర్వేషన్లు సాధించి తీరుతాం

### మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడి

ఖమ్మం,అక్టోబర్ 18(ఆర్‌ఎన్‌ఎ): కులగణన ఆధారంగా బీసీల రిజర్వేషన్ల కోసం శాసనసభలో అన్ని పార్టీల ఆమోదం తీసుకొని హైకోర్టు, సుప్రీంకోర్టు ద్వారా న్యాయం కోసం ముందుకెళ్లామని మంత్రి తుమ్మల నాగేశ్వరావు అన్నారు. సత్తుపల్లిలో చేపట్టిన బీసీ బంద్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశ ప్రజల మనోభావాలకు తగ్గట్టుగా రాజ్యాంగబద్ధంగా అందరికీ సమన్యాయం జరిగి, రాజ్యాధికారం కల్పించాలనేదే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఉద్దేశమని పేర్కొన్నారు. కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు

- మిగతా 3 లో..



## పాక్-అఫ్గాన్ ఘర్షణలు

06

వాటిని ఆపడం నాకు చాలా తేలిక : ట్రంప్



06

## మా త్యాగాలను అర్థం చేసుకోలేదు

అఫ్గాన్‌తో ఘర్షణల వేళ వాపోయిన పాక్ మంత్రి

# రిజర్వేషన్ ఇచ్చేటోళ్లే బంద్‌కు మద్దతిచ్చుడేంది?

తెలంగాణ ఉద్యమతరహాలో బిసి ఉద్యమం

### ఆటోలతో ర్యాలీ నిర్వహించిన జాగృతి అధ్యక్షురాలు కవిత



హైదరాబాద్,అక్టోబర్ 18(ఆర్‌ఎన్‌ఎ): తెలంగాణ ఉద్యమం మాదిరిగా మరో బీసీ ఉద్యమాన్ని చేపడతామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. బీసీల బంద్‌కు మద్దతుగా ఆటోలతో ర్యాలీగా బయల్దేరి హైదరాబాద్ లోని ఖైరతాబాద్ చౌరస్తాలో మానవహారం నిర్వహించి మాట్లాడారు. గంటపాటు ఖైరతాబాద్ చౌరస్తాలో మానవహారం నిర్వహించి బీసీ రిజర్వేషన్లు

- మిగతా 2 లో..



# తల్లిదండ్రులను పట్టించుకోకపోతే జీతంలో 15 శాతం కట్

## ఉద్యోగులకు సీఎం రేవంత్ హెచ్చరిక

- దీని కోసం త్వరలో చట్టం తీసుకొస్తాం : సీఎం రేవంత్‌రెడ్డి
- గ్రూప్-2 ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేత

నిస్సహాయకులకు సహాయం అందించడమే మన బాధ్యత అని అని గ్రూప్-2 ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. "తల్లిదండ్రులు, పుట్టి పెరిగిన ఊరును అభివృద్ధి చేసుకోవడం మన బాధ్యత.. మీరందరూ అంకితమవుతారని పూర్తి విశ్వాసం ఉంది. ఉద్యోగార్థులు ఎవరైనా తల్లిదండ్రులను పట్టించుకోకపోతే .. మీ జీతంలో 10 నుంచి 15శాతం కోత విధించి తల్లిదండ్రుల ఖాతాలో వేస్తా. ఒకటో తేదీ మీ జీతం ఎలా వస్తుందో.. అలాగే మీ తల్లిదండ్రుల అకౌంట్‌లో ఒకటో తేదీన పడుతుంది. దీని కోసం త్వరలో చట్టం తీసుకొస్తాం" అని సీఎం అన్నారు.



## సొంత నిర్ణయాలను పక్కన పెట్టండి


- ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా సాగండి
- విధి నిర్వహణలో అలసత్వం తగదని గుర్తించండి
- అధికారులకు సిఎం రేవంత్ హెచ్చరిక లాంటి సూచన

**హైదరాబాద్, అక్టోబర్ 18 :** సొంత నిర్ణయాలను పక్కన పెట్టండి, ప్రభుత్వ విధా నాలకు అనుగుణంగా సాగండి.. విధి నిర్వహణలో అలసత్వం తగదని

- మిగతా 2 లో..

# పాక్ వైమానిక దాడి..

## ముగ్గురు అఫ్గాన్ క్రికెటర్లు మృతి



SIBGHATULLAH | HAROON | KABEER AGHA

పొరుగు దేశాలతో ప్రశాంతంగా ఉండాలని పాకిస్థాన్‌కు అస్సలు అనిపించదేమో. మొన్నటివరకూ భారత్ మీదకు వచ్చి చావు దెబ్బతిన్న పాక్.. ఈసారి మరో సరిహద్దు దేశం అఫ్గానిస్థాన్‌పై దాడులకు పాల్పడింది. ఈస్టన్ పాక్టికా ప్రావిన్స్‌పై పాకిస్థాన్ వైమానిక దాడి చేసింది. ఈ ఘటనలో 8 మంది ప్రాణాలు కోల్పోగా, మరో ఏడుగురు గాయపడ్డారు. మృతుల్లో ముగ్గురు దేశవాళీ క్రికెటర్లు ఉన్నట్లు అఫ్గానిస్థాన్ క్రికెట్ బోర్డు తెలిపింది.

07



## నిండు గర్భిణిని హతమార్చిన మామ

కుమురం భీం జిల్లాలో దారుణం


కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా దహేగాం మండలంలో దారుణం చోటు చేసుకుంది. గెర్రే గ్రామంలో రాణి అనే 9 నెలల గర్భిణిని ఆమె మామ సత్యనారాయణ హత్య చేశాడు. గొడ్డలి, కత్తితో నరికి ప్రాణాలు తీశాడు.

04

# పాక్ గతాన్ని మరువకపోతే చావుదెబ్బ తప్పదు

### పాక్‌లోని ప్రతి అంగుళం బ్రహ్మోస్ రేంజ్‌లోనే..

### పాక్‌కు రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ వార్నింగ్



పాక్ గతాన్ని మరచి ప్రేలాపనలు పేలితో చావుదెబ్బ తప్పదని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఘాటు హెచ్చరికలు చేశారు. ఆపరేషన్ సింధూరంను మరచిపోయి మాట్లాడొద్దని హెచ్చరించారు. పాక్‌లోని ప్రతి అంగుళం బ్రహ్మోస్ రేంజ్‌లోనే ఉందని గట్టి వార్నింగ్ ఇచ్చారు. ఆపరేషన్ సిందూర్ ట్రైలర్ మాత్రమేనని మరోమారు దాయాది పాక్‌ని హెచ్చరించారు. బ్రహ్మోస్ క్షిపణులను సైన్యానికి అప్పగించిన నేపథ్యంలో శనివారం మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. ఉత్తర్‌ప్రదేశ్ రాజధాని లక్నోలో బ్రహ్మోస్ ఏరోస్పేస్ యూనిట్‌ను రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సందర్శించారు.

06

# జీఎస్టీ ధమాకాతో ప్రజలకు మేలు

### మీడియాతో ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్



ఎన్డీఏ ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త జీఎస్టీ సంస్కరణల వల్ల దేశంలో కొనుగోళ్లు పెరుగుతున్నాయని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. తాము అనుకున్న దానికన్న ఎక్కువగానే ప్రజలకు మేలు జరుగుతోందన్నారు. దసరా సమయంలో ప్రజలు రికార్డు స్థాయిలో చేసిన కొనుగోళ్ల ద్వారా సంస్కరణల ప్రభావం కనిపిస్తోందని చెప్పారు. జీఎస్టీ 2.0పై కేంద్రమంత్రులు నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. సెప్టెంబర్ 22న తీసుకువచ్చిన సంస్కరణల వల్ల వినియోగదారుల్లో కొనుగోలు శక్తి పెరిగిందన్నారు. జీఎస్టీ 2.0 ద్వారా ప్రజలు ఊహించిన దానికంటే ఎక్కువ పన్ను తగ్గింపులు చేపట్టామన్నారు. అందువల్లే వినియోగదారులు ఆశించిన దానికంటే ఎక్కువ ప్రయోజనాలను పొందుతున్నారన్నారు.

06

# ప్రశాంతంగా బీసీ బంద్

(మొదటి పేజీ తరువాయి)


నేతలు, కార్యకర్తలు బంద్‌లో పాల్గొన్నారు. బీసీ సంఘాల నేతలు, పోలీసులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. సికింద్రాబాద్‌లో బీసీ బంద్ కార్యక్రమంలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే గణేశ్‌తో కలిసి మంత్రి కొండా సురేఖ, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. సికింద్రాబాద్‌లోని జూబ్లీ బస్టాండ్ వద్ద జరిగిన ధర్నాలో భాజపా ఎంపీ ఈటల రాజేందర్ పాల్గొన్నారు. ఎంజీబీఎస్ వద్ద తెలంగాణ బీసీ ఐకాస నేతలు బైఠాయించి బస్సులను అడ్డుకున్నారు. మహబూబ్‌నగర్ ఆర్టీసీ డిపో ముందు ధర్నాలో భారత రాష్ట్ర సమితి నేత శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు. నిజామాబాద్, వికారాబాద్ ఆర్టీసీ డిపోల ముందు నేతలు ఆందోళనకు దిగారు. తెలంగాణ వ్యాప్తంగా బీసీ సంఘాల బంద్‌తో ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఆర్టీసీ బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. వరంగల్‌లో పలు బస్టాండ్లు వెలవెలబోయాయి. బంద్‌లో పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొని నిరసన వ్యక్తం చేశారు. బీసీ ఐకాస చేపట్టిన బంద్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ప్రశాంతంగా సాగింది. అత్యవసర సేవలు మినహా మిగతా రంగాలన్నీ బంద్ పాటించాయి. పలు చోట్ల నాయకులు నిరసనలు, ర్యాలీలు చేపట్టారు. మరోవైపు బంద్‌ను శాంతియుతంగా నిర్వహించుకోవాలని డీజీపీ సూచించడంతో ఎక్కడా అవాంఛనీయ ఘటనలు జరగలేదు. హైదరాబాద్ అంబర్‌పేట్ ప్రాంతంలో బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ.. బీసీ సంఘాల నాయకులు బంద్ చేపట్టారు. ఈ బంద్‌కు కాంగ్రెస్ పార్టీ పూర్తి మద్దతు ప్రకటించింది. అయితే బంద్ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో పార్టీ సీనియర్ నేత వి.హనుమంతరావు పాల్గొన్నారు. వి.హనుమంతరావుతో సహా కాంగ్రెస్ నేతలు బ్యానర్లు, ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేస్తూ.. ర్యాలీగా ముందుకు సాగారు. ఈ నేపథ్యంలో ర్యాలీలో వి.హనుమంతరావు ప్లెక్సీ పట్టుకుని నడుస్తుండగా.. అది అడ్డువచ్చి కిందపడిపోయారు. వెంటనే స్పందించిన కాంగ్రెస్ నేతలు వి.హనుమంతరావును పైకి లేపారు.



అనంతరం ర్యాలీ యథావిధిగా కొనసాగింది. వి.హనుమంతరావు కొద్దిసేపు విశ్రాంతి తీసుకుని అనంతరం ర్యాలీలో పాల్గొన్నారు. కాగా, బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలి, కేంద్ర ప్రభుత్వం బీసీ బిల్లు పాస్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## కాశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరణ చేస్తాం

- సరైన సమయంలో దీనిపై నిర్ణయం తీసుకుంటాం
- కేంద్రహోంమంత్రి అమిత్ షా వెల్లడి



**పాట్నా, అక్టోబర్ 18 :** జమ్మూ కశ్మీర్ కు రాష్ట్ర హోదా పునరుద్ధరణ పై సరైన సమయంలో నిర్ణయం తీసుకుంటామని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా తెలిపారు. కేంద్ర పాలిత ప్రాంతైన లద్దాఖ్ విషయంలోనూ ప్రజలు లేవనెత్తిన డిమాం డ్లపై కూడా 'మంచి తీర్మానం' చేస్తామని హామీ ఇచ్చారు. పాట్నాలో శనివారంనాడు జరిగిన మీడియా కాంక్లేవ్‌లో హోం మంత్రి మాట్లాడుతూ, ఉగ్రవాదం గుప్పిట్లో చిక్కిన జమ్మూకశ్మీర్ 370వ అధికరణ తర్వాత యూటర్న్ తీసుకుందని, గత తొమ్మిది నెలల్లో లోకల్ టెర్రరిస్ట్ రిక్రూట్‌మెంట్ ఒక్కటి కూడా చోటుచేసుకోలేదని అన్నారు. '1990 నుంచి వేర్పాటువాద చీడపీడల్లో చిక్కుకున్న జమ్ముకశ్మీర్‌లో గుణాత్మకమైన మార్పు వచ్చింది. గతంలో సరిహద్దులకు ఆవల నుంచి టెర్రరిస్టులను పంపాల్సిన అవసరం లేదని పాక్ భావించేది. మన పిల్లల చేతుల్లో ఆయుధాలు ఉంచేది. ఇప్పుడు పరిస్థితి మారింది. జమ్మూకశ్మీర్ ప్రజలంతా తాము దేశంతో ఉన్నామని, యావత్ దేశం తమ వెంట ఉందని బలంగా విశ్వసిస్తున్నారు' అని అమిత్‌షా చెప్పారు. మ్యూకశ్మీర్‌లో ప్రజాస్వామ్య పునరుద్ధరణ జరిగిందని, పంచాయతీలు, మున్సిపాలిటీల తో పాటు అసెంబ్లీకి ఎన్నికలు కూడా జరిగాయని, రాజ్యసభ ఎన్నికలు కూడా త్వరలో జరగనున్నాయని అమిత్‌షా చెప్పారు. తాను సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన తర్వాత కూడా ఇంతవరకూ రాష్ట్ర హోదా పునరుద్ధరణ జరగలేదంటూ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ, రాజకీయ అనివార్యతల వల్ల ఆయన అలా చెప్పి ఉండొచ్చని అన్నారు. కానీ రాష్ట్ర హోదా పునరుద్ధరణ సరైన సమయంలో జరుగుతుందని, సీఎంతో కూడా చర్చిస్తామని చెప్పారు. లద్దాఖ్‌లో ఇటీవల జరిగిన ఆందోళనను ప్రస్తావిస్తూ, లెహ్, కార్గిల్ కమిటీలతో కేంద్రం సంభాషణలు జరుపుతోందని చెప్పారు. ప్రజలు ఓర్పుతో ఉండాలని కోరారు. వారి న్యాయపరమైన డిమాండ్లపై మంచి తీర్మానం జరుగుతుందని వివరించారు. సామాజిక కార్యకర్త సోనం వాంగ్‌చుక్ విడుదల అవకాశాలపై అడిగినప్పుడు, ప్రజల డిమాండ్లపైనే తాను మాట్లాడుతున్నానని, వ్యక్తుల డిమాండ్ల గురించి కాదని అన్నారు. ఆయనకు (వాంగ్‌చుక్) సంబంధించిన కేసు కోర్టు ముందు ఉందని, సాక్ష్యాల ఆధారంగా కోర్టు నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు.

## తెలంగాణ ఉద్యమతరహాలో బిసి ఉద్యమం

(మొదటి పేజీ తరువాయి)

అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీసీ బిడ్డలు తమకు రిజర్వేషన్లు కావాలని కోరుతున్నారని.. రిజర్వేషన్లు ఇచ్చే పార్టీలే బంద్ కు మద్దతు ప్రకటించటం నవ్వులాటగా ఉందని ఎద్దేవా చేశారు. దొంగ జీవోలు ఇచ్చిన కాంగ్రెస్, బీసీ బిల్లును పాస్ చేయించాల్సిన బీజేపీలు బంద్ కు మద్దతు పేరుతో డ్రామాలు చేస్తున్నాయని మండిపడ్డారు. హంతకులే వచ్చి నివాళులు అర్పించినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. బీసీ బిడ్డలను పదే పదే మోసం చేస్తున్నారని.. స్వాతంత్రం వచ్చిన నాటి నుంచి బీసీలను మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ బీసీ బిడ్డల పంతం దేశానికి ఆదర్శంగా నిలవాలని అన్నారు. యూనైటెడ్ ఫూలే ఫ్రంట్ ఆధ్వర్యంలో జాగృతి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని.. బీసీ బంద్ ను విజయవంతం చేయాలని ప్రతి ఒక్కరినీ కోరుతున్నట్లు తెలిపారు. బీసీల రిజర్వేషన్లు అమలు చేసేలా టెక్నికల్ గా ప్రభుత్వాలు సరైన వాదనలు వినిపించటం లేదని కవిత విమర్శించారు. ఈ కారణంగానే బీసీలకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో తీర్పులు వస్తున్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీ రూల్స్ ప్రకారం జనగణన నిర్వహించలేదని చెప్పారు. జీవో 9 విషయంలో కూడా కాంగ్రెస్ కు చిత్తశుద్ధి లేదని.. అందుకే కోర్టు జీవో ను కొట్టేసిందని అన్నారు. బీసీల రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్, బీజేపీలకు చిత్తశుద్ధి లేదని మండిపడ్డారు. ఇప్పటికిప్పుడే ఎన్నికలు జరగాల్సినంత తొందర ఏముంది? అని ప్రశ్నించారు. మహారాష్ట్ర, తమిళనాడు లో 5 ఏళ్ల వరకు ఎన్నికలు జరగలేదని.. బీసీలకు రిజర్వేషన్ల అంశం తేలిన తర్వాత ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. సర్పంచ్ లకు బిల్లులు ఇవ్వకుండా కాంగ్రెస్ పార్టీ వారిని ఇబ్బంది పెడుతోందన్ని ÷ర్ అయ్యారు. బీసీ రిజర్వేషన్లను అమలు చేయాల్సిన పార్టీలు చిత్తశుద్ధిగా పనిచేయాలని తాను డిమాండ్ చేస్తున్నట్లు చెప్పారు. మానవహారంలో పాల్గొన్న యూపీఎఫ్ కన్వీనర్ బొల్ల శివశంకర్ మాట్లాడుతూ.. '78 ఏళ్లుగా బీసీలు రాజ్యాధికారం కోసం కొట్లాడుతున్నారు. కానీ రాజకీయ పార్టీలు బీసీ లను మోసం చేస్తున్నాయి. రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ డ్రామాలు చేస్తోంది. రాష్ట్రపతి వద్ద బిల్లును పాస్ చేయించకుండా బీజేపీ కూడా నాటకాలు ఆడుతోంది. బీఆర్ఎస్ కూడా కులగణన చేయకుండా మోసం చేసింది. జూబ్లీహిల్స్ లో బీసీల ఓట్ల కోసం కాంగ్రెస్ నాటకం చేస్తోంది. ఏ పార్టీ కూడా బీసీలకు మంచి చేయటం లేదు. బీసీలు మూడో ఫ్రంట్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. దొంగ మాటలు చెప్పే పార్టీలకు బీసీలంతా బుద్ధి చెప్పే రోజు వస్తుంది. రిజర్వేషన్ల విషయంలో తూతూ మంత్రంగా చేతులు దులుపుకునే ప్రయత్నం చేయవద్దు. బీసీలు మీ చెప్పు చేతల్లో లేరు. మీ పాపాల లెక్కను మేము రాసుకుంటాం. బీసీలను మోసం చేస్తున్న అన్ని పార్టీలకు రాబోయే రోజుల్లో బుద్ధి చెబుతాం. బీసీల పట్ల మద్దతు ఇవ్వాలని కోరుతున్నాం' అని వ్యాఖ్యానించారు.

## దండుపాళ్యం బ్యాచ్ ఎవరిదో ప్రజలకు బాగా తెలుసు

- అవినీతి, అక్రమాలు కప్పిపుంచుకుంటే పోవు
- హరీష్ రావు వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించిన మంత్రి శ్రీధర్‌బాబు

**హైదరాబాద్,అక్టోబర్ 18 :** దండుపాళ్యం పాలన ఎవరిదో అందరికీ తెలుసని, అధికారంలేదన్న అసహనంతో కేబినెట్‌పై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని బీఆర్ఎస్ నేతలపై తెలంగాణ రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతర్గత కుమ్ములాటలు కప్పిపుచ్చుకునేందుకే కాంగ్రెస్ ప్రభుత్వంపై కట్టుకథలు అల్లి ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. గత పాలనా వైఫల్యాలను దాచేందుకు మైండ్ గేమ్ ఆడుతున్నారని తెలిపారు. అవినీతి, అక్రమాలతో రాజ్యమేలిన వారు ఇప్పుడు మాపై విమర్శలు చేస్తున్నారని అన్నారు. ఇలా విమర్శలు చేసి, అవినీతి, అక్రమాలను దాచుకోలేరని గట్టిగా హెచ్చరించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ మంత్రులందరిదీ ఒకటే జెండా, ఒకటే అజెండా అని, గత 20 నెలల్లో రాష్ట్రానికి రూ.3.2 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని శ్రీధర్ బాబు గుర్తు చేశారు. తమ పాలన అభివృద్ధే లక్ష్యంగా నడుస్తుందని, ఎలీ లిల్లీ లాంటి అంతర్జాతీయ కంపెనీలు తెలంగాణకు రావడం తమ కృషికి నిదర్శనమని అన్నారు. బీఆర్ఎస్ పార్టీలోని అంతర్గత కుమ్ములాటల్ని కప్పిపుచ్చుకోవడానికి తమపై బురద చల్లడం మానాలని హితవు పలికారు. విజ్ఞులైన ప్రజలు మీ మైండ్ గేమ్‌లను నమ్మరని గుర్తుంచు కోవాలని, రాజకీయాలను పక్కన పెట్టి రాష్ట్రాభివృద్ధికి సహకరించాలని బీఆర్ఎస్ నేతలకు విజ్ఞప్తి చేశారు. గత ఆర్థిక సంవత్సరం తొలి 6 నెలల్లో రూ.12, 864 కోట్ల ఎఫ్‌డీఐలు తెలంగాణకు వచ్చాయన్నారు. 33 శాతం పెరుగుదలతో దేశంలో టాప్ 3 అర్బన్ ఎఫ్‌డీఐ కేంద్రాల్లో హైదరాబాద్ ఉందని తెలిపారు. పరిశ్రమల జీఎస్‌వీఏ రూ.2.77 లక్షల కోట్లకు పెరిగిందని, ఇది జాతీయ సగటు కంటే ఎక్కువని పేర్కొన్నారు. ఇవన్నీ పట్టించుకోకుండా విమర్శలు చేస్తున్న హరీష్ రావు తదితరుల తీరుపై శ్రీధర్ బాబు మండిపడ్డారు. పదేళ్లలో చేయలేని ఎన్నో పనులను ఈ రెండేళ్ల స్వల్ప కాలంలో తాము చేసి చూపామని అన్నారు.

## తల్లిదండ్రులను పట్టించుకోకపోతే ఉద్యోగుల జీతంలో కోత

**హైదరాబాద్:** హైదరాబాద్ శిల్ప కళావేదికలో జరిగిన కార్యక్రమంలో గ్రూప్-2 ఉద్యోగాలకు ఎంపికైన 783 మంది అభ్యర్థులకు సీఎం, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సీఎస్ రామకృష్ణారావు, మంత్రి పొన్నం ప్రభాకర్.. చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు. "శ్రీకాంతాచారి, వేణుగోపాల్‌రెడ్డి, ఈషాన్‌రెడ్డి, యాదయ్య లాంటి యువ విద్యార్థులు తమ జీవితాలను ధారపోసి.. ఆత్మబలిదానాల తో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారు. యూనివర్సిటీల్లో ఉంటూ వేలాది మంది విద్యార్థులు తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నారు. కానీ, ఆనాటి రాజకీయ పార్టీల నాయకులు.. నీళ్లు, నిధులు, నియామకాలనే నినాదాన్ని, తెలంగాణ ప్రజల బలమైన ఆకాంక్షను ఆయుధంగా మార్చుకొని పదేళ్లు రాష్ట్రంలో అధికారాన్ని చెలాయించారు. కానీ, నిరుద్యోగుల సమస్యలను పట్టించుకోలేదు. వాళ్ల కుటుంబ సభ్యులు, బంధు వర్గాన్ని ఆగర్భ శ్రీమంతులు చేయటం కోసమే పదేళ్లు పరిపాలన సాగింది. ప్రజల గురించి ఆలోచించి ఉంటే కాళేశ్వరం..కూలేశ్వరం అయి ఉండేది కాదు. రూ.లక్ష కోట్లతో కట్టిన ఒక ప్రాజెక్టు మూడేళ్లకే కూలిన ఘటన ప్రపంచంలో ఎక్కడా జరగలేదు. తన ఫామ్‌హౌజ్‌లో ఎకరా పంటపై రూ.కోటి ఆదాయం వస్తుందని ఒక పెద్దాయన చెప్పారు. ఎకరాపై రూ.కోటి ఆదాయం వచ్చే విద్యను యువత, ప్రజలకు ఎందుకు ఇవ్వలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులకు ప్రాధాన్యం ఇచ్చింది. ప్రభుత్వ పాఠశాలలో చదివిన నేను ఈ స్థాయిలో ఉన్నానంటే మీ ఆశీర్వాదాలే కారణం. రూ.3కోట్లు తీసుకుని గ్రూప్-1 ఉద్యోగం ఇచ్చారని గత పాలకులు ఆరోపణలు చేశారు. పేదింటి బిడ్డలు రూ.3 కోట్లు ఇచ్చి ఉద్యోగం కొనగలరా? కష్టపడి చదివిన వారిని అవమానించేలా మాట్లాడారు. రాజకీయ చౌకబారు విమర్శలు విమర్శలు ఎదుర్కొన్నప్పుడు చాలా ఆవేదన కలిగింది. గతంలో ఎన్నడూ



జరగని కులగణన.. కాంగ్రెస్ పోరాటం వల్లే త్వరలో సాధ్యం కానుంది" అని రేవంత్‌రెడ్డి అన్నారు.



## తెలంగాణలో మద్యం దుకాణాల దరఖాస్తు గడువు పెంపు

**హైదరాబాద్:** తెలంగాణలో కొత్త మద్యం దుకాణాల కేటాయింపులకు సంబంధించి దరఖాస్తుల దాఖలు గడువును ప్రభుత్వం పొడిగించింది. ఈ నెల 23 వరకు గడువు పెంచుతున్నట్లు ఎక్సైజ్‌శాఖ కమిషనర్ ప్రకటించారు. బీసీ బంద్, బ్యాంకుల బంద్‌లతో దరఖాస్తు చేసుకోలేకపోయామన్న ఫిర్యాదులతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఔత్సాహికుల విజ్ఞప్తి మేరకు దరఖాస్తుల గడువు పెంచుతున్నట్లు తెలిపారు. దీంతో ఈ నెల 23న జరగాల్సిన మద్యం షాపుల డ్రా వాయిదా పడింది. ఈనెల 27న కలెక్టర్ల సమక్షంలో ఈ డ్రా తీయనున్నారు. రాష్ట్రంలో కొత్త మద్యం విధానానికి(2025-27) సంబంధించి గత నెల 26న దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. క్రితంసారి మద్యం విధానంలో రూ.2 లక్షలుగా ఉన్న రుసుం ఈసారి రూ.3 లక్షలకు పెంచారు. మొత్తం 2,620 మద్యం దుకాణాలకు దరఖాస్తులను ఆహ్వానించగా, శనివారం నాటికి 85,363 దరఖాస్తులు రాగా, నిన్న ఒక్కరోజే 38,754 దరఖాస్తుల వచ్చినట్లు అధికారులు తెలిపారు.

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక..

### విష్ణువర్ధన్‌రెడ్డితో నామినేషన్ వేయించిన గులాబీ పార్టీ



**హైదరాబాద్, అక్టోబర్ 18 :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను అన్ని పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్త పడుతున్నాయి. ఈ క్రమంలోనే భారత రాష్ట్రసమితి జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కోసం పీజేఆర్ కుమారుడు విష్ణువర్ధన్‌రెడ్డితోనూ నామినేషన్ వేయించింది. ఇప్పటికే ఆ పార్టీ తరఫున మాగంటి సునీత 3 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. అయితే, నామినేషన్ తిరస్కరణకు గురైతే ఇబ్బందులు ఎదురవుతాయన్న ఉద్దేశంతో ముందు జాగ్రత్తగా విష్ణువర్ధన్‌రెడ్డితోనూ భారత రాష్ట్ర సమితి నేతలు నామినేషన్ వేయించారు. మరోవైపు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ తరఫున ప్రచారం చేసేందుకు 40 మంది క్యాంపైనర్లతో ఆ పార్టీ లిస్ట్ విడుదల చేసింది. ఆ జాబితాలో ప్రముఖ నేతలు, మంత్రులు, ఎమ్మెల్యేలు ఉన్నారు. పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యే దానం నాగేందర్ కూడా ఉన్నారు.

## న్యాయ వాదులు అంకితభావంతో పనిచేయాలి

### కొత్త కోర్టు భవన సముదానికి శంకుస్థాపన

**జనగామ, అక్టోబర్ 18 :** కోర్టులకు వచ్చే కక్షిదారులకు మెరుగైన న్యాయ సేవలు అందించడానికి న్యాయమూర్తులతో పాటు న్యాయవాదులు కూడా అంకితభావంతో పనిచేయాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విజయసేన్ రెడ్డి సూచించారు. జనగామ పట్టణ శివారు చంపక్ హిల్స్‌లో 10 ఎకరాల్లో జనగామ జిల్లా నూతన కోర్టు భవన నిర్మాణ సముదాయాలకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ జిల్లా కేంద్రాల్లో కొత్తగా నిర్మించే భవనాల్లో అన్ని సౌకర్యాలు ఉంటాయని తెలిపారు. మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపట్టామన్నారు. కక్షిదారుల కేసులు పెండింగ్ లేకుండా పరిష్కరించాడానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు సుద్దాల చలపతి రావు, మధుసూదన్ రావు , రాజేశ్వరరావు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి ప్రతిమ, సీనియర్ సివిల్ జడ్జిలు,తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి ద్వంధ్వ నీతిని వీడాలి

### బిసి బిల్లు ఆమోదంపై స్పష్టత ఇవ్వాలి : పొన్నం

**హైదరాబాద్,అక్టోబర్ 18 :** రాజ్యాంగంలో జనాభా ప్రాతిపదికన బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పనకు చట్టబద్ధత కల్పించాలని కేంద్రంలో ఉన్న భాజపాను మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఆమోదించినా ఎందుకు చట్టబద్దత కల్పించరని అన్నారు. బిజెపి ఇక్కడ మద్దతు ఇస్తూ..కేంద్రంలో వ్యతిరేకిస్తోందని మండిపడ్డారు. ఈ ద్వంద్వనీతిని ప్రజలు నిలదీస్తారని అన్నారు. తెలంగాణ వ్యాప్తంగా బీసీ బంద్ సందర్భంగా హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, సీతక్క, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, ఇతర ముఖ్య నేతలు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ.. బీసీ బంద్‌లో తెలంగాణ వ్యాప్తంగా మంత్రులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బీసీ రిజర్వేషన్లపై చిత్తశుద్ధితో పని చేస్తోందన్నారు. ఇందు కోసం కుల సర్వే నిర్వహించినట్లు తెలిపారు. భాజపా రాష్ట్రంలో బీసీ బిల్లుకు మద్దతిచ్చి.. కేంద్రంలో మాత్రం వెనకడుగు వేస్తోందని విమర్శించారు. దీనిపై ఆ పార్టీ నేతలు సమాధానం ఇవ్వాలన్నారు.




## మహారాష్ట్రలో ఘోర రోడ్డు ప్రమాదం

- అదుపుతప్పి లోయలో పడ్డ బస్సు
- 8మంది ప్రయాణికుల దుర్మరణం

**ముంబై, అక్టోబర్ 18 :** మహారాష్ట్రలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ప్రయాణికులతో తీసుకెళ్తున్న వాహనం అదుపుతప్పి లోయలో పడింది. ఈ ప్రమాదంలో ఎనిమంది దుర్మరణం చెందారు. తొలుత ఆరుగురు చనిపోగా..ఆస్పత్రికి తరలిస్తుండగా మరో ఇద్దరు చనిపోయారు. ఈ ప్రమాదంలో 28 మంది గాయపడ్డారు. వీరి కూడా 15 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. మహారాష్ట్రలోని నందుర్బార్ జిల్లాలోని చాంద్శైలి ప్రాంతం(అరజీనిటబజీత్తి÷తి ఉరజీబి ంఇఇతిట।నిబి) సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. శనివారం ప్రయాణికులను తీసుకువెళ్తున్న వాహనం చాంద్శైలి ఘాట్ లో ప్రాంతంలో అదుపుతప్పి లోయలో పడింది. మూలమలుపు వద్ద డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. బాధితులంతా స్థానికంగా ఉండే ఓ పుణ్యక్షేత్రానికి వెళ్లి తిరుగు ప్రయాణం అయ్యారు. ఈ క్రమంలోనే మరికాసేపట్లో ఇళ్లకు చేరుకుంటాము అనుకునే సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాద ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు, రెస్క్యూ టీమ్ అక్కడి చేరుకున్నారు. గాయపడిన వారిని సమీపంలోని ఆస్పత్రులకు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఒకే ప్రాంతానికి చెందిన 8 మంది మృతి చెందడటంతో వారి కుటుంబాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఇలా నిత్యం కొందరు డ్రైవర్ల నిర్లక్ష్యానికి, ఇతర కారణాలతో ఎంతో మంది అమాయకులు బలవుతున్నారు. వాహనాలు, వాటిని నడిపే డ్రైవర్ల విషయంలో ప్రభుత్వాలు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు భావిస్తున్నారు.

# బంద్‌తో క్యాబ్, ఆటోలకు డిమాండ్

## డబుల్ రేట్లు వసూలు చేయడంపై జనం ఆగ్రహం

## కరీంనగర్‌లోని హోటల్ శ్వేతపై దాడి



హైదరాబాద్,అక్టోబర్ 18: తెలంగాణ వ్యాప్తంగా బీసీ బంద్ కొనసాగుతున్న వేళ ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడ్డారు.. ఎక్కడికక్కడ ఆర్టీసీ బస్సుల్లో వాహనాలు నిలిచిపోయాయి. ఈ క్రమంలోనే హైదరాబాద్ లోని ఉప్పల్ రింగ్ రోడ్డు వద్ద ప్రైవేటు క్యాబ్ దందా జోరుగా సాగుతోంది. బస్సులు నడవకపోవడంతో ఎలాగూ క్యాబుల్లో ప్రయాణించాలి కాబట్టి చార్జీలు భారీగా పెంచారు. ప్రయాణికుల నుంచి అధికశాతం ఛార్జీలు వసూలు చేయడంతో లబోదిబోమంటున్నారు. ఉప్పల్ నుంచి హనుమకొండకు క్యాబ్ డ్రైవర్లు డబుల్ ఛార్జీలు వసూలుచేస్తున్నారు. సాధారణ రోజుల్లో రూ.300 తీసుకుంటుండగా.. నేడు బంద్ ప్రభావం కారణంగా రూ.700 వసూలు చేస్తున్నారు. నగరంలోని సిటీ బస్సులన్నీ డిపోలకే పరిమితం అవడంతో సొంత ఊర్లకు వెళ్లేవారు నానా తంటాలు పడుతున్నారు. ప్రజలు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకుంటున్నారు. మెట్రో రైళ్ల సర్వీసులు యధావిధిగా కొనసాగుతుండటంతో మెట్రో కిక్కిరిసిపోయింది. ప్రధాన మెట్రో స్టేషన్ల వద్ద, ముఖ్యంగా ఉప్పల్, ఎల్బీ నగర్, అమీర్ పేట్ వంటి కేంద్రాల్లో భారీగా ప్రయాణికులు చేరుకుంటున్నారు. ల్గ÷దరాబాద్‌లో ఎంజీబీఎస్ ముందు బీసీ సంఘాల నేతల ఆందోళన చేపట్టారు. జూబ్లీ బస్ స్టేషన్ లో బీసీ సంఘాలు బైఠాయించాయి. జేబీఎస్ దగ్గర బంద్‌లో బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ పాల్గొన్నారు. రాజేంద్రనగర్, దిల్‌సుఖ్‌నగర్, బండ్లగూడ, హయత్‌నగర్, బర్కత్‌పురా, ఇబ్రహీంపట్నం సహా ఆర్టీసీ డిపోల్లో బస్సులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ కోసం రాష్ట్ర వ్యాప్తంగా బీసీ సంఘాలు బంద్ చేపట్టాయి. హైదరాబాద్ లోని దిల్ సుఖ్ నగర్ బస్ డిపో వద్ద బీసీ బంద్ ఉద్ధృతంగా సాగుతోంది. ఉదయం నుంచే రో÷డడెక్కి బీసీ సంఘాల నేతలు, వివిధ పార్టీల నాయకులు వ్యాపార సంస్థలను బంద్ చేయిస్తున్నారు. ప్రైవేటు బస్సులను అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. దీంతో పోలీసులకు, బీసీ సంఘాల నేతలకు మధ్య వాగ్వాదం చెలరేగింది. బీసీ బంద్ జరుగుతున్న వేళ కరీంనగర్‌లోని హోటల్ శ్వేత తెరచి ఉంచారు. దీంతో సీపీఐ నాయకులు హోటల్ లోకి వెళ్లి ఫర్నిచర్, సామాగ్రి ధ్వంసం చేశారు. హోటల్ మూసివేసి బంద్ లో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. అయినా హోటల్ నిర్వాహకులు పట్టించుకోకపోవడంతో ధ్వంసం చేశారు.

# సొంత నిర్ణయాలను పక్కన పెట్టండి

## ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా సాగండి

## విధి నిర్వహణలో అలసత్వం తగదని గుర్తించండి

## అధికారులకు సిఎం రేవంత్ హెచ్చరిక



హైదరాబాద్,అక్టోబర్ 18: సొంత నిర్ణయాలను పక్కన పెట్టండి, ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా సాగండి..విధి నిర్వహణలో అలసత్వం తగదని గుర్తించండి అంటూ అధికారులకు సిఎం రేవంత్ హెచ్చరిక లాంటి సూచన చేశారు. పథకాలు, అభివృద్ధి పనుల అమల్లో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటై రెండేళ్లు గడుస్తున్నా.. కొందరు అధికారుల పనితీరులో ఇంకా మార్పు రాలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. సీఎస్ రామకృష్ణారావు, సీఎంవో కార్యదర్శులతో సీఎం రేవంత్ శనివారం సమావేశమయ్యారు. కొందరు ముఖ్య కార్యదర్శులు, విభాగాధిపతుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇంకా పాతపద్ధతిలోనే పోతామంటే కుదరదని అన్నారు. అధికారులు అలసత్వం వీడి అభివృద్ధి పనులపై దృష్టిసారించాలని హితవు పలికారు. సొంత నిర్ణయాలతో అధికారులు ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకురావొద్దని సూచించారు. అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేస్తేనే పనులు వేగవంతమవుతాయని, ప్రజలకు మేలు జరిగే నిర్ణయాలు, కార్యక్రమాలకు ప్రాధాన్యమివ్వాలని దిశానిర్దేశర చేశారు. ఎప్పటికప్పుడు నివేదికలు తెప్పించుకొని, పనుల పురోగతిని సమీక్షించాలన్నారు. కీలక దస్త్రాలు, పనులు ఎక్కడా ఆగిపోవడానికి వీల్లేదు. కేంద్రం నుంచి గ్రాంట్లు, నిధులు రాబట్టుకునే కార్యాచరణను వెంటనే చేపట్టాలి. ఇకపై సీఎస్, సీఎంవో అధికారులు ప్రతివారం నివేదికలు అందించాలని సీఎం ఆదేశించారు.




# తెలంగాణ ఉద్యమ తరహాలో పోరాటం

## అప్పడే బిసిలకు రాజ్యాధికారం సాధ్యం

## బంద్‌లో పాల్గొన్న ఎంపీ ఈటల రాజేందర్

హైదరాబాద్,అక్టోబర్18: తెలంగాణ రాష్ట్రం ఎలా సాధ్యమైందో బీసీ రాజ్యాధికారం కూడా అలాగే సాధ్యం అవుతుందని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ఆశయాన్ని ముద్దాడే వరకు ఐక్యంగా ఉద్యమాలు చేద్దామని బీసీ వర్గానికి పిలుపునిచ్చారు. హైదరాబాద్ లోని జూబ్లీ బస్ స్టేషన్, సికింద్రాబాద్ లో బీసీల బంద్ లో ఈటెల పాల్గొన్నారు. స్థానిక ఎన్నికల్లో 42శాతం బీసీ రిజర్వేషన్ల కోసం బీసీ సంఘాల జేఏసీ పిలుపు మేరకు భారతీయ జనతా పార్టీ సంపూర్ణంగా మద్దతు తెలిపిందని చెప్పారు. ఇందులో భాగంగానే ఈరోజు ఉదయం సికింద్రాబాద్ జూబ్లీ బస్ స్టేషన్ వద్ద 'తెలంగాణ బంద్ లో పాల్గొని మద్దతు తెలిపినట్లు వివరించారు. బీసీ రిజర్వేషన్ అమలు కాదని స్వయంగా సీఎం రేవంత్ రెడ్డి నిండు అసెంబ్లీలో చెప్పారని.. అన్నీ తెలిసినా బీసీలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. తమిళనాడు ఒక్కటి మాత్రమే నిజాయితీగా రిజర్వేషన్లు అమలు చేసిందని చెప్పారు. పెరియార్ మొదలు అనేక గొప్ప ఉద్యమాలు జరిగాయని అన్నారు. 21 మంది రిటైర్డ్ ఐఏఎస్ అధికారులతో రెండేళ్లపాటు బీసీల ఆర్థిక, సామాజిక, విద్య అన్ని రంగాలపై సమగ్ర సర్వే చేసి.. ఆ రిపోర్ట్ తో రాజ్యాంగంలో 9వ షెడ్యూల్ లో చేర్చారని గుర్తు చేశారు. తెలంగాణలోనూ కేసీఆర్ ఒకసారి సర్వే చేసి బీసీ కమిషన్ వేశారని.. ఎన్ని వేసిన నిజాయితీ లేదు కాబట్టి అమలు కాలేదని విమర్శించారు. ప్రభుత్వం కూడా పేరుకు కమిషన్లు వేశారు తప్ప నిజాయితీ లేదని దుయ్యబట్టారు ఈటల. లెక్కలు తీశారు.. కానీ అవన్నీ తప్పుల తడక అని విమర్శించారు. 52 శాతం ఉంటే 42 శాతం అని కాకి లెక్కలు చెప్తున్నారని మండిపడ్డారు. తాను చెప్పేది అబద్ధమైతే రాజకీయాల నుంచి తప్పుకుంటానని సవాల్ విసిరారు. తాను మాట్లాడిన మాటలపై ఎక్కడైనా చర్చకు సిద్ధమని అన్నారు. తామెంత మంది ఉన్నామో.. తమకు అంత కావాలని అన్నారు. యాచించే స్థాయిలో కాదు శాసించే స్థాయిలో బీసీలు ఉన్నారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ పార్టీ అయినా.. స్వతంత్రం వచ్చినప్పటి నుంచి ఒక్క బీసీ, ఒక ట్రైబల్ ముఖ్యమంత్రి కాలేకపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ రాష్ట్రంలో బీసీలు 8మంది మంత్రులుండాలని కానీ, ముగ్గురే ఉన్నారని ధ్వజమెత్తారు. ఉన్నా వారికి ఇచ్చిన మంత్రి శాఖలు చిన్నవే అని పేర్కొన్నారు. బీసీల పట్ల మొసలికన్నీరు కాకపోతే నామినేటెడ్ పోస్టుల్లో ఎందుకు బీసీలకు స్థానం కల్పించలేదు? అని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తెలంగాణలో బీసీని సీఎం చేస్తానని ప్రకటించిన ప్రధాని మోదీ క్యాబినెట్ లో 27మంది క్షఅ మంత్రులు ఉన్నారని గుర్తు చేశారు. బీజేపీ నిజాయితీని ఎవరు శంకించలేరని అన్నారు. మాదిగ రిజర్వేషన్ చేస్తామని మాట ఇచ్చి ప్రధాని అమలు చేశారని గుర్తు చేశారు. తమిళనాడులో ఏ పద్ధతి ప్రకారం చేశారో అదే పద్ధతిలో ఇక్కడ కూడా చెయ్యాలని రేవంత్ సర్కార్ ను డిమాండ్ చేశారు. ఈ బంద్ కి పిలుపు ఇచ్చింది బీసీ జేఏసీ అని.. అనివార్యంగా అన్ని పార్టీలు పాల్గొనాల్సిన పరిస్థితి వచ్చిందని వ్యాఖ్యానించారు. ఈ ఉద్యమం ఇక్కడితో ఆగదని చెప్పారు. బీసీ బంద్ విజయవంతం కావడం తొలిసారని చెప్పుకొచ్చారు. 42 శాతం రిజర్వేషన్ల స్థానిక సంస్థలలో మాత్రమే కాదు.. చట్టసభల్లోనూ వచ్చే వరకు పోరాటం ఆగదని స్పష్టం చేశారు.

# బస్సుల బంద్.. ప్రయాణికుల ఇబ్బంది

## పండగ ముందు బంద్ నిర్వహణపై ఆగ్రహం

## బస్సుల నిలిపివేతతో బస్టాండ్లలో పడిగాపులు

హైదరాబాద్,అక్టోబర్18: దీపావళికి ముందు బంద్ నిర్వహించడంపై ప్రయాణికులు భగ్గుమన్నారు. పండగ ముందు బస్సులు బంద్ ఏంటని నిలదీసారు. బంద్ చేస్తున్న నాయకులతో పలుచోట్ల వాగ్వాదానికి దిగారు. బస్సులు బంద చేస్తే గ్రామాలకు ఎలా వెళ్లాలని అన్నారు. బీసీ బంద్ నేపథ్యంలో జూబ్లీ బస్టాండ్ నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లాల్సిన బస్సులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. భాజపా ఎంపీ ఈటల రాజేందర్ రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో జూబ్లీ బస్ స్టేషన్‌లో బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. మరోవైపు దీపావళి పండుగతో పాటు వారాంతపు సెలవులు ఉండడంతో వివిధ జిల్లాలకు వెళ్లాల్సిన ప్రయాణికులతో జేబీఎస్‌లో రద్దీ పెరిగింది. ముందస్తు సమాచారం లేకపోవడంతో బస్ స్టేషన్‌లో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వీలైనంత త్వరగా బస్సులను ప్రారంభించాలని కోరారు. కుటుంబ సభ్యులు, చిన్నారులు, వయోవృద్ధులతో గంటల తరబడి బస్ స్టేషన్‌లో వేచి ఉన్నట్లు ప్రయాణికులు చెప్పారు. మరోవైపు ప్రధాన బస్టాండ్ ఎంజీబీఎస్‌లోనూ ప్రయాణికులు బస్సులు లేక పడిగాపులు కాసారు. కరీంనగర్, నిజామాబాద్, వరంగల్, విజయవాడ, ఖమ్మం, సిద్దిపేట, సూర్యాపేట, నల్గొండ తదితర ప్రాంతాలకు వెళ్లాల్సిన వారు బస్సులు దొరక్క తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు ఇదే అదనుగా క్యాబ్ డ్రైవర్లు అధిక మొత్తంలో వసూలు చేస్తున్నారు. దీంతో ఆర్టీసీ బస్సుల కోసం ప్రయాణికులు బస్టాండ్లలో గంటల కొద్దీ నిరీక్షిస్తున్నారు.

# ఇంటి సమస్యకు తోడు ఆరోగ్య సమస్యలు

## దర్శనం మొగులయ్యకు కేటీఆర్ హామీ



హైదరాబాద్, అక్టోబర్ 18 : ఇంటి స్థల సమస్య, ఆరోగ్య సమస్యతో బాధపడుతున్న పద్మశ్రీ అవార్డు గ్రహీత దర్శనం మొగులయ్యకు మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అండగా నిలిచారు. శనివారం కేటీఆర్‌ను మొగులయ్య కలిశారు. ఈ సందర్భంగా తన సమస్యను మాజీ మంత్రికి వివరించారు మొగులయ్య. తాను కట్టుకున్న ఇంటి గోడలను కబ్జాదారులు కూల్చి వేస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. తనకు గత ప్రభుత్వం ఇచ్చిన భూమిని కాపాడి తమ కుటుంబానికి అండగా నిలబడాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మొగులయ్య ఆరోగ్యం, యోగక్షేమాల గురించి కేటీఆర్ ఆరా తీశారు. కంటి చికిత్స చేయిస్తానంటూ హామీ ఇచ్చారు. కేటీఆర్‌ను కలిసిన మొగులయ్య తన కంటిచూపు మందగించిందని, చికిత్స కోసం ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన కేటీఆర్.. మొగులయ్యకు హైదరాబాద్‌లోని ఎల్వీ ప్రసాద్ ఐ హాస్పిటల్‌లో పూర్తి చికిత్సను అందించే బాధ్యతను తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు. అనంతరం గత ప్రభుత్వం తనకు హయత్‌నగర్ మండలంలో కేటాయించిన 600 గజాల స్థలం విషయంలో కొంతమంది వ్యక్తుల నుంచి ఎదురవుతున్న ఇబ్బందులు, కోర్టు కేసుల వివరాలను కేటీఆర్‌కు మొగులయ్య వివరించారు. తాను కట్టుకున్న గోడలను, ఇంటిని కూడా కూలగొట్టారని, కోర్టు కేసులు వేసి వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు గత ప్రభుత్వం ఇచ్చిన స్థలాన్ని కాపాడాలని కేటీఆర్‌ను కోరారు. అనేకసార్లు కలెక్టర్ల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ తనకు పరిష్కారం దొరకలేదని, తనకు అండగా నిలవాలని మొగులయ్య కోరారు. దీనిపై స్పందించిన కేటీఆర్.. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డికి ఫోన్ చేసి మాట్లాడారు. సమస్యను వెంటనే పరిష్కరించి, మొగులయ్యకు న్యాయం చేయాలని కలెక్టర్‌ను మంత్రి కేటీఆర్ కోరారు.

# బిసి బంద్ సందర్భంగా ఉద్రిక్తత

## నల్లగొండలో కార్ల షోరూమ్‌పై దాడి

నల్లగొండ,అక్టోబర్ 18: బీసీ 42శాతం రిజర్వేషన్లకోసం బీసీ సంఘాల జేఏసీ తలపెట్టిన తెలంగాణ రాష్ట్రవ్యాప్త బంద్ ప్రశాంతంగా సాగింది.శనివారం అన్ని జిల్లాల్లో స్వచ్ఛందంగా బంద్ పాటించారు. ఆర్టీసీ బస్సులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఈ క్రమంలో నల్గొండ జిల్లాలో బీసీ జేఏసీ బంద్ ఉద్రిక్తతకు దారి తీసింది. పట్టణంలోని చర్లపల్లి పవన్ మోటార్స్ కార్ల షోరూంపై బీజేపీ కార్యకర్తలు దాడి చేశారు. బంద్ చేయకుండా షోరూం ఓపెన్ చేసారంటూ ఆగ్రహం వ్యక్తం చేసిన కార్యకర్తలు షోరూం అద్దాలు ధ్వంసం చేశారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న నల్గొండ డీఎస్పీ ఘటనాస్థలాన్ని పరిశీలించారు. ఇదిలా ఉండగా.. హైదరాబాద్? సిటీలో కూడా వ్యాపారులు స్వచ్ఛందంగా షాపులు మూసివేసి బంద్? లో పాల్గొన్నారు. జూబ్లీ బస్ స్టేషన్ దగ్గర బీసీ సంఘాల నాయకులు బంద్ లో పాల్గొన్నారు. 42 శాతం కోసం బీసీల సంఘాల బంద్ పిలుపు మేరకు జూబ్లీ బస్ స్టేషన్ వద్ద బీసీ సంఘాల నేతలు బంద్ లో పాల్గొన్నారు. శేరిలింగంపల్లి లో బీసీ జేఏసీ ఆధ్వర్యంలో బంద్?పాటించారు. బంద్ కారణంగా ఆర్టీసీ బస్సులు డిపోలకే పరిమితం అయ్యారు. ఎంజీబీఎస్, కంటోన్మెంట్, ఫికెట్ లలో బస్సులు డిపోలలోనే ఉండిపోయాయి. మరోవైపు దిల్ సుఖ్ నగర్ డిపోలో ఆర్టీసీ కార్మికులు స్వచ్ఛందగా బీసీ బంద్? పాటించారు. దీంతో పండక్కి వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బంద్ ప్రభావం తో ఉప్పల్ మెట్రో రైలు ప్రయాణాన్ని ఎంచుకున్నారుప్రయాణికులు.

# బిసి బిల్లు కోసం త్వరలో మోడీని కలుస్తాం: పిసిసి చీఫ్

హైదరాబాద్,అక్టోబర్ 18: బీసీ బంద్‌లో భాగంగా కాంగ్రెస్ పార్టీ అంబర్‌పేట్ చౌరస్తా దగ్గర నిర్వహించిన ర్యాలీలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బంద్ విజయవంతమైందని పేర్కొన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొన్నారని తెలిపారు.బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్‌కు ఉన్న చిత్తశుద్ధి ఏ పార్టీకి లేదు. కుల సర్వే చేశాం. జీవో ఇచ్చాం. బీసీ బిల్లుకు ఆమోదం తెలపాలని త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన ప్రధాని మోదీని కలుస్తాం. ప్రభుత్వ పరంగా 42 శాతంతో ఎన్నికలకు వెళ్లాలని చూస్తున్నాం. సాధ్యాసాధ్యాలు పరిశీలించిన తర్వాత స్థానిక ఎన్నికలపై నిర్ణయం తీసుకుంటాం అని పేర్కొన్నారు.



# బిసి రిజర్వేషన్లు సాధించి తీరుతాం

## అందరి ఆమోదంతోనే ముందుకు సాగుతాం

## మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడి

ఖమ్మం,అక్టోబర్ 18: కులగణన ఆధారంగా బీసీల రిజర్వేషన్ల కోసం శాసనసభలో అన్ని పార్టీల ఆమోదం తీసుకొని హైకోర్టు, సుప్రీంకోర్టు ద్వారా న్యాయం కోసం ముందుకెళ్లామని మంత్రి తుమ్మల నాగేశ్వరావు అన్నారు. సత్తుపల్లిలో చేపట్టిన బీసీ బంద్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశ ప్రజల మనోభావాలకు తగ్గట్టుగా రాజ్యాంగబద్ధంగా అందరికీ సమన్యాయం జరిగి, రాజ్యాధికారం కల్పించాలనేదే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఉద్దేశమని పేర్కొన్నారు. కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు దేశ ప్రజల కోసం రాహుల్ గాంధీ పాదయాత్ర చేపట్టారని మంత్రి తుమ్మల గుర్తు చేశారు. అందరికీ విద్యా, ఉద్యోగం కల్పించాలనే గొప్ప సామాజిక విప్లవం కోసం రాహుల్ గాంధీ మేనిఫెస్టో రూపొందించారని మంత్రి తుమ్మల నాగేశ్వరావు తెలిపారు. కొద్ది తేడాతో కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాలేక పోయిందని అసహనం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని గెలిపించిన ప్రజలకు ఇచ్చిన మాట ప్రకామరమే.. బీసీ రిజర్వేషన్ల కోసం రాజ్యాంగబద్ధంగా ఉన్న అధికారాలతోనే చట్టం చేశామని పేర్కొన్నారు. చట్టబద్ధత ఇవ్వాల్సిన గవర్నర్లు, రాష్ట్రపతి పట్టించుకోవడం లేదని తుమ్మల ఆరోపించారు. న్యాయబద్ధంగా చట్టసభల్లో అమలు చేసిన కూడా సాంకేతిక కారణాలతో బీసీ రిజర్వేషన్ల అమలుకు అడ్డుపడుతున్నారని మండిపడ్డారు. గుజరాత్ రాష్ట్రంలో చట్ట సవరణ ద్వారానే ప్రధానమంత్రి మోదీ బీసీగా కన్వర్ట్ అయ్యారని మంత్రి తుమ్మల తెలిపారు. నరేంద్ర మోదీ కులం బీసీ కాకపోయినా అక్కడ రాష్ట్ర ప్రభుత్వం ఆయన సామాజిక వర్గాన్ని బీసీలో చేర్చిందని పేర్కొన్నారు. బీసీగా ప్రధానమంత్రి స్థానం దక్కించుకున్న మోదీ, తెలంగాణలో బీసీలకు న్యాయం చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరావు డిమాండ్ చేశారు.

# కాంగ్రెస్ మోసపూరిత విధానాలు

## బిసి రిజర్వేషన్ల పేరుతో డ్రామాలు

## మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్


హైదరాబాద్,అక్టోబర్18:కామారెడ్డి డిక్లరేషన్ పేరుతో బీసీలను మభ్యపెట్టాలని చూశారని.. కానీ బీసీలు వాస్తవాలను తెలుసుకున్నారని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ చెప్పారు. బీసీ రిజర్వేషన్ల పేరుతో వారిని మోసం చేయడం దారుణమని పేర్కొన్నారు. చెల్లని జీవోలను, ఆర్డినెన్సును రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిందని ఎద్దేవా చేశారు. తెలంగాణ వ్యాప్తంగా బీసీ బంద్ కొనసాగుతోందని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ స్పష్టం చేశారు. బీసీ బంద్‌కు మద్దతు తెలుపుతూ బస్ భవన్‌కు బయలుదేరే ముందు తెలంగాణ భవన్ వద్ద మీడియాతో ఆయన మాట్లాడారు. బీసీ రిజర్వేషన్ల పేరుతో కాంగ్రెస్ పెద్ద డ్రామా ఆడుతోందని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీకి కాంగ్రెస్ ప్రభుత్వానికి బీసీలపై ఎలాంటి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. హైకోర్టు ఇచ్చిన స్టేతో బీసీలపై కాంగ్రెస్ పార్టీ వైఖరి బట్టబయలైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల పేరుతో కాంగ్రెస్ పార్టీ ద్రోహం చేసిందని ఆరోపించారు. కేవలం కాంగ్రెస్ పార్టీ వ్యవహరించిన మోసపూరిత విధానాలతో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ దక్కకుండా పోయిందన్నారు. రాష్ట్రంలో సమస్యలు పరిష్కరించే నాధుడే కరువయ్యాడని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి తెలంగాణ ప్రజలను మభ్యపెట్టి మోసం చేస్తున్నాయని విమర్శించారు. కామారెడ్డి డిక్లరేషన్ బూటకం అని ఫైర్ అయ్యారు. ఞాజీ మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ.. 'బీసీ బంద్‌లో కాంగ్రెస్, బీజేపీ పాల్గొంటున్నాయి. మొక్కుబడిగా బీసీ బంద్‌లో కాంగ్రెస్, బీజేపీ భాగస్వామ్యం కావొద్దు. బీసీలకు రాజ్యాంగ సవరణ ద్వారానే 42 శాతం రిజర్వేషన్లు వస్తాయి. బీసీ రిజర్వేషన్లు తగ్గిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయి. బీసీలకు ఒక్క శాతం రిజర్వేషన్ తగ్గవద్దు' అని హెచ్చరించారు.



# బంద్‌లో పాల్గొనని బిఆర్ఎస్, బిజెపి ముఖ్య నేతలు

హైదరాబాద్,అక్టోబర్ 18: బీసీలకు 42శాతం రిజర్వేషన్ల కల్పించాలనే డిమాండ్‌తో తెలంగాణ అంతటా బంద్ కొనసాగింది. అయితే తాము వ్యతిరేకం కాదని చెబుతూ వస్తున్న పార్టీల చీఫ్ లు మాత్రం ఆందోళనల్లో పత్తా లేకుండా పోయారు. ఆర్ కృష్ణయ్య స్వయంగా అన్ని పార్టీల చీఫ్ లను కలిసి బంద్ కు మద్దతు కోరారు. అందరూ పూర్తి మద్దతు ప్రకటించారు. అయితే బంద్ లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు పాల్గొనలేదు. ఆర్టీసీ క్రాస్ రోడ్డులో నిర్వహించిన నిరసనలో మాజీ మంత్రులు శ్రీనివాస్ గౌడ్, తలసాని శ్రీనివాస్ యాదవ్, గంగుల కమలాకర్ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా బీజేపీ స్టేట్ చీఫ్ రాంచందర్ రావు, బీజేఎల్పీ నాయకుడు మహేశ్వర్ రెడ్డి కూడా ధర్నాల వైపు రాలేదు. దీంతో వీళ్లు ఎందుకు రాలేదనే చర్చ మొదలైంది. అదే సమయంలో పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఆందోళనలో పాల్గొన్నారు. బైక్ ర్యాలీ నిర్వహించారు. ట్యాంకు బండ్ పై బైఠాయించారు.

# అప్పుల నరకాసురుడిని వధించడమే కర్తవ్యం!




**తెలుగు రాష్ట్రాలను అప్పుల నరకాసురుడు వేధిస్తున్నాడు. కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాడు. మనమంతా కలసికట్టుగా ఈ అప్పుల నరకాసరుడిని అంతమొందించాలి. వీడిని మనకు తగిలించిన రాజకీయ పార్టీలకు తగు విధంగా బుద్ధి చెప్పాలి. లేకుంటే మనమంతా కాళరాత్రిలో కాలం గడపాల్సి ఉంటుంది. ఉమ్మడిగా ఉన్న ఏపిలో లేనంత అవినీతి అక్రమాలు, విడిపోయాక విజృంభించాయి. ఏటా దీపావళి ఆనందాలు వెల్లివిరియాల్సిన చోట..అప్పుల అమావాస్య కమ్మకుంది.**

ప్రస్తుత, గత పాలకుల తీరు చూస్తే ఈ రెండు రాష్ట్రాలు అప్పుల ఊబినుంచి బయటపడే మార్గం కనిపించడం లేదు. వరాల జల్లు కురిపించడం ద్వారా ప్రజలను నట్టేట ముంచుతున్నారు. అధికారంలోకి వచ్చాక చేతికి ఎముక లేదన్నట్లుగా ఉచిత పథకాలు అమలు చేస్తున్నారు. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడులాంటి పెద్దమనిషి అడపదడపా హెచ్చరిస్తున్నా పట్టించుకోవడం లేదు. అలాగని చేసిన అప్పులతో రాష్ట్రాలు బాగుపడ్డాయా అంటే అదీ లేదు. నెలనెలా జీతాలు ఇవ్వడం కూడా ఇప్పుడు ప్రభుత్వ ప్రతిభకు గీటురాయిగా మారింది. అప్పులు చేయడంలో వెనుకబడకూడదని పాలక పార్టీలూ భావిస్తున్నాయి. సంక్షేమ పథకాల పేరిట డబ్బు పంచి పెట్టినంత మాత్రాన ప్రజలు మళ్లీ మళ్లీ గెలిపిస్తున్నారా అంటే అదీ లేదు! ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలూ ప్రజలకు డబ్బు పంచుతున్నాయి. తాజాగా బీహార్ ఎన్నికలు కావచ్చు, జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కావచ్చు డబ్బు పందేరాలకు రెడీగా ఉన్నారు. ప్రజలుకూడా వచ్చిన కాడికి తీసుకోవాలన్న ధోరణిలో ఉన్నారు. అయితే డబ్బు తీసుకుంటున్న ప్రజలు మాత్రం తాము అనుకున్న వారికే ఓటు వేస్తున్నారు. ఈ డబ్బు పంపకం ఆగితే తప్ప మన ప్రజాసవామ్యం బాగుపడదు. అలాగే సంక్షేమ పథకాల పేరుతో చేస్తున్న డబ్బు పందేరాలకు కూడా ఎక్కడో ఒక చోట ఫుల్ స్టాప్ పడకపోతే తిప్పలు తప్పేలా లేవు. అలాగే పథకాలు పొందని ప్రజలు, పన్నులు చెల్లిస్తున్న వారు దీనిని నిలదీయక మానరు. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో గత పన్నెండేళ్లుగా ఇదే సాగింది. భావి తరాలకు మంచి భవిష్యత్తు ఇవ్వడం ఎలా అన్నది పక్కకు పోయింది.

అప్పులు చేసి పండగ చేస్తున్నారు. ప్రజలు కూడా అలవాటు పడ్డారు. ఓట్ల పండగ రావాలని కోరుకుంటున్నారు. ఈ పద్దతి మారకుంటే అభివృద్ధి అన్నది పక్కకు పోయి పంచడమే పాలన అనే పద్దతి పాకిపోతుంది. అలా జరగకుండా రాజకీయ పార్టీలను కట్టడి చేయడానికి ప్రజలే పూనుకోవాలి. ప్రజలే చొరవ తీసుకొని హద్దులు మీరుతున్న సంక్షేమ పథకాల అమలుపై నిరసన గళం ఎత్తాలి. అప్పులతో ప్రజలకుపంచడంతో పాటు, పాలకులు కూడా సోకులు చేసుకుంటున్నారు. ఇలా ఎంతకాలం చేసిన ప్రజలకు అమావాస్య చీకట్లు తప్పవు. పాలకలుకు నిత్యదీపావళి కూడా తప్పదు. తాజా పరిస్థితులు చూస్తుంటే ఆందోళన కలుగుతోంది. ఎంతకాలమిా అప్పుల జాతర అన్నది తెలియడం లేదు. లేని పక్షంలో రెండు తెలుగు రాష్ట్రాలు కోలుకోలేని విధంగా అప్పుల ఊబిలో కూరుకుపోతాయి!అప్పు చేయనిదే పూట గడవని పరిస్థితి ఉన్నప్పటికీ రెండు రాష్టాల్లో కొనసాగుతోంది. ప్రభుత్వాల మాటలు మాత్రం కోటలు దాటు తున్నాయి. ఏదడిగినా లేదనకుండా హామీలు ఇచ్చేస్తున్నారు. తెలుగు రాష్ట్రాలకేఈ దుస్థితి ఎందుకు వచ్చిందన్నది తెలుసుకోవాలి. ఎపి విభజన తరవాత కెసిఆర్, జగన్ చేసని నిర్వాకంతో ఇదంతా మొదలయ్యింది. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు తెలంగాణ ధనిక రాష్ట్రమని కెసిఆర్ ఊరూరా ఊదరగొట్టారు. రాష్ట్రం రెవెన్యూ మిగులులో ఉందని కేసీఆర్ ప్రకటించారు. అదే సమయంలో విభజిత ఆంధ్రప్రదేశ్ రూ.20 వేల కోట్లకు పైగా రెవెన్యూ లోటుతో ఏర్పడింది. 11 ఏళ్లు గడిచేసరికి ధనిక రాష్ట్రమైన తెలంగాణ కూడా అప్పుల కుప్పగా మారింది. అప్పు కోసం వెళితే దొంగను చూసినట్టు చూస్తున్నారని ప్రస్తుత తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వాస్తవాన్ని బయటపెట్టారు.

తెలంగాణ పరువు తీస్తావా అని బిఆర్ఎస్ నేతలు రేవంత్‌పై కత్తులు దూస్తున్నారు. ఆంధ్రలో కూడా ఇదే దుస్థితి ఉంది. జగన్ తనను తాను ఓ యువరాజుగా భావించి భీమిలి బీచ్ వద్ద ప్యాలెస్‌లు కట్టుకున్నారు. రాష్ట్రం అప్పులు పది లక్షల కోట్లు దాటాయి. అటు ధనిక రాష్ట్రం, ఇటు రెవెన్యూ లోటుతో ఏర్పడిన రాష్ట్రం కూడా కుదేలవడానికి కారణం ఇద్దరు నేతలే అని వేరుగా చెప్పనక్కర్లేదు. పలు పతకాల పేరుతో రాష్ట్రాలను లూటీ చేయించారు. ప్రజాధనాన్ని పప్పు బెల్లాల్లా పంచిపెట్టడంతో ఇప్పుడు దివాళకు చేరుకున్నాయి. దారుణం ఏమంటే సంక్షేమ పథకాలకు కూడా అప్పులు చేయవలసి వస్తోంది. వేలకోట్లు వడ్డీలుగా చెల్లించాల్సి వస్తోంది. ప్రభుత్వ ఆస్తులను కుదువ పెట్టడమే కాకుండా, భవిష్యత్ ఆదాయాలను కూడా తాకట్టు పెట్టి అప్పులు చేసి సంక్షేమ పథకాలు అమలు చేయడం వల్లనే తెలుగునాట దుర్భర పరిస్థితి దాపురించింది. అధికారం కోసం రాజకీయ పార్టీలు అడ్డమైన గడ్డి తింటాయనడానికి ఈ రెండు రాష్ట్రాల ఆర్థిక దుస్తితి కారణంగా చెప్పుకోవాలి. ఇప్పుడు పాలకులు దీని నుంచి బయటపడకుండా మరీ అప్పులు చేసేస్తున్నారు. సంక్షేమం పేరిట అలవికాని పథకాలను ప్రకటిస్తూ తెలుగు రాష్ట్రాలను దివాలా తీయిస్తున్నారు. దీంతో ప్రజలకు మౌలిక సదుపాయాలు కరువై అల్లాడుతున్నారు. ఆర్థిక పరిస్థితి దారుణంగా ఉందని తెలిసి కూడా కొత్త పథకాల ప్రకటనలో పాలకపార్టీలు తగ్గేదేలే అన్నట్టుగా పోటీ పడుతున్నాయి. ఉచితబస్సు, ఉచిత బియ్యం, ఉచితంగా వేల రూపాయల బదిలీలు ..వంటివన్నీచేస్తున్నారు. కానీ ఒక్క రోడ్డు గుంత పూడ్చడానికి మత్రం డబ్బులు ఉండడం లేదు. ఎన్నికల్లో ప్రయోజనం పొందడమే లక్ష్యంగా సంక్షేమ పథకాలను రేసు గుర్రాల్లా వదిలారు. అభివృద్ధి పనులకు అవసరమైన నిధుల కోసం ప్రస్తుత రేవంత్ హైదరాబాద్‌లోని ప్రభుత్వ భూములను కూడా ఎడా పెడా అమ్మేస్తున్నారు. అయినా రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతూనే ఉంది. రైతు రుణ మాఫీ కోసం దాదాపు పాతిక వేల కోట్ల రూపాయలు పంచిపెట్టిన తీరువవల్ల కలిగిన ప్రయోజనం కూడా అంతంత మాత్రమే. జగన్ బాధపోయినా ఆంధ్రప్రదేశ్‌లో కూడా సంక్షేమ పథకాల జాతర ఆగడం లేదు. తెలంగాణలో ప్రారంభమైన అనేక పథకాలను ఆంధ్రప్రదేశ్‌లో కూడా అమలు చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆపసోపాలు పడుతున్నరు. 2 1ప్పుల నరకాసురుడిని మనమే కాల్చాలి. ప్రజలే ఇందుకు పూనుకోవాలి. పథకాల పేరుతో చేస్తున్న అప్పులపై ప్రశ్నించాలి. అప్పుడే మనకు నిజమైన దీపావళి అని గుర్తించాలి.

# దీపావళి అంటేనే దీపాలు వెలిగించడం

## లక్ష్మీపూజలతో పాటు.. ఇంట్లో దీపాల వెలుగు

**విజయవాడ, అక్టోబర్ 18 :** దీపావళికి ఇంట్లో దీపాలు వెలిగించడం, లక్ష్మీదేవికి పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఊరంతా దీపాలు వెలగించే సమయమిది. ఇళ్లల్లో అయితే ఇక చెప్పనక్కరలేదు. అయితే దీపాలు ఎక్కడెక్కడ వెలగిస్తే మంచిదో కూడా తెలుసుకోవాలి. దీపావళి అక్టోబర్ 20న సోమవారం జరుపుకుంటున్నారు. దీపావళి రోజున లక్ష్మీ దేవిని పూజించడంతో పాటు, లక్ష్మీ పూజలు చేయించడం ఆనవాయితీగా వస్తోంది. అలాగే ఇంట్లో దీపాలు వెలిగించడం కూడా చాలా పవిత్రమైనదిగా పరిగణిస్తారు. ఈ రోజున దీపాలు వెలిగించడం వల్ల ఇంటి నుండి ప్రతికూల శక్తి తొలగిపోయి సానుకూల శక్తి వస్తుందని నమ్ముతారు. కాబట్టి, దీపావళి రోజున ఇంట్లో ఆయా ప్రదేశాలలో దీపాలు వెలిగించడం శుభప్రదం. దీపావళి నాడు ఇంటి ప్రాంగణంలో దీపం వెలిగించాలి. ఇది ఇంటి నుండి ప్రతికూల శక్తిని దూరంగా ఉంచడంలో సహాయపడుతుంది. ఇది ఆర్థిక పరిస్థితిని మెరుగుపరుస్తుందని, జీవితంలో ఆనందాన్ని తెస్తుందని నమ్ముతారు. దీపావళి నాడు ఇంటి ప్రధాన ద్వారం వద్ద దీపం వెలిగించడం ప్రత్యేక ప్రాముఖ్యతను కలిగి ఉంటుంది. మత విశ్వాసాల ప్రకారం, అలా చేయడం వల్ల



ఇంట్లో సంపద, శ్రేయస్సు పెరుగుతుంది. ఇంట్లోకి సానుకూల శక్తి వస్తుంది. దీపావళి రోజున వంటగదిలో దీపం వెలిగించడం చాలా శుభప్రదంగా భావిస్తారు. వంటగదిలో దీపం వెలిగించడం ద్వారా, మీరు అన్నపూర్ణేశ్వరి ఆశీస్సులను పొందవచ్చు. దీపావళి నాడు, తులసి మొక్క దగ్గర దీపం వెలిగించాలి. తులసి మొక్క దగ్గర దీపం వెలిగించడం ద్వారా లక్ష్మీదేవి ఆశీస్సులను పొందవచ్చు. ఇది జీవితంలో ఆనందం, శాంతిని ఇస్తుందని నమ్ముతారు. తులసికోట వద్ద కార్తీక మాసంలో కూడా దీపాలు వెలిగిస్తారు. కొందరు దీపావళి నుంచి కార్తీకమాసం వరకు వెలిగిస్తూనే ఉంటారు.

# దీపావళి రోజు లక్ష్మీపూజకు ప్రత్యేకం

**తిరుమల, అక్టోబర్ 18 :** భారతీయ సాంస్కృతిక వారసత్వ చిహ్నం మన దీపావళి. దీనికి అనేక కథనాలు మనకు కనిపిస్తాయి. ప్రధానంగా నరకాసురుడిని వధించన రోజుగా... దీపావళిని యుగయుగాలుగా జరుపుకొంటున్న పండుగ దీపావళి. భారతీయ సనాతన ధర్మం దీపారాధనకు విశిష్ట స్థానం ఇచ్చింది. దీపావళి నాడు లక్ష్మీ పూజ నిర్వహించాలని విష్ణు, మార్కండేయ పురాణాలు ప్రత్యేకంగా చెప్పాయి. క్షీరసాగర మథనంలో లక్ష్మీదేవి ఆవిర్భవించిన రోజును దీపావళిగా కూడా పేర్కొంటారు. దీపావళి నాటి సాయంత్రం ఇంటి ముంగిట కల్లాపు చల్లి ముగ్గులు పెట్టాలి. తులసికోట దగ్గర అలంకారాలు చేయాలి. అష్టయిశ్వైర్యాలు అనుగ్రహించే లక్ష్మీదేవితోపాటు గణపతిని కూడా అర్చించాలి. ప్రమిదల్లో దీపాలు వెలిగించాలి. షడ్రుచులతో కూడిన వంటకాలను నివేదించాలి. ధూప, దీప నివేదనలు పూర్తయిన తరువాత... ప్రమిదలను ఇంటి ముంగిట అలంకరించాలి. తులసికోట దగ్గర, ప్రతి గుమ్మానికి ఇరువైపులా దీపాలు పెట్టాలి. అలా దీపజ్యోతులతో ప్రకాశవంతమైన ఇంటికి మహాలక్ష్మి వచ్చి కొలువై ఉంటుందంటారు. దీపదర్శనం సకల పాపాలను పోగొడుతుంది. హృదయం అనే ప్రమిదలో భక్తి అనే తైలాన్ని నింపి, విశ్వాసం అనే వత్తిని ప్రేమ అనే అగ్నితో జ్వలింపజేసేదే దీపం. కళ్ళలో కనిపించే వెలుగు దాని కాంతి, జ్ఞానం అనే జ్యోతి. దీపకాంతులు విరజిమ్మే ఇంట్లో లక్ష్మీదేవి నివసిస్తుందనీ, నిత్యం ఉభయ సంధ్యల్లో దీపాలు వెలిగే ఇంట సిరిసంపదలు, సౌభాగ్యాలు వెల్లివిరుస్తాయని శాస్త్రవచనం. దీపావళి వేడుకలు ప్రాచీన కాలం నుంచి జరుగుతున్నాయి. పురాణాల్లో, ఇతిహాసాల్లో దీని ప్రస్తావన ఉంది. శ్రీఆదిశంకరాచార్యులు షణ్మత స్థాపన చేసినప్పుడు... పంచాయతన పూజా విధానంలో స్కంధునికి ప్రతీకగా... దీపారాధన ఏర్పాటు చేశారు. ఏ శుభ కార్యాన్ని ప్రారంభించినా ముందుగా దీపారాధన చేయడం ఆచారం. దీపం అగ్నికి సంకేతం. సత్కార్యాన్ని అడ్డుకోవడానికి వచ్చిన దుష్టశక్తులను దహించేయాలన్నది దానిలోని అంతరార్థం. సృష్టి, స్థితి, లయలకు దీపంతో సంబంధం ఉంది. దీపంలో కనిపించే నీలం, తెలుపు, ఎరుపు రంగులు త్రిమూర్తులకు ప్రతీకలంటారు. అదే విధంగా, విద్య, శక్తి, ఐశ్వర్యాలను ప్రసాదించే సరస్వతి, దుర్గ, మహాలక్ష్మి ఆ దీపకాంతిలో కొలువై ఉంటారని పూర్వులు చెప్పారు. ప్రస్తుతం




వివిధ ప్రాంతాల వారు తమతమ ఆనవాయితీల ప్రకారం ఈ పండుగను నిర్వహించుకుంటున్నారు. ఉత్తర, పశ్చిమ ప్రాంతాల్లో అయిదు రోజుల పాటు... ధనత్రయోదశి (లక్ష్మీ పూజ), నరకచతుర్దశి (నరక సంహారం), దీపావళి (నరకాసుర సంహారానికి ఆనందం ప్రకటించడం, పితృదేవతలను స్మరిస్తూ, భూలోకానికి వచ్చిన వారు తిరిగి ఊర్ధ్వలోకాలకు వెళ్ళే మార్గం సూచిస్తున్నట్టు దివిటీలు చూపించడం) ఆశ్వయుజ మాసం చివరిలో వస్తాయి. కార్తిక మాసం ప్రారంభం రోజును... అంటే 'బలి పాడ్యమి'గా పరిగణిస్తారు. ఆ రోజున గోవర్ధన పూజలు జరుగుతాయి. విదియనాడు సోదరి ఇంట సోదరుడు విందు (భగినీ హస్తభోజనం) ఆరగించి, దీవెనలు, కానుకలు ఇస్తాడు. ఇది రక్షాబంధన్‌ను పోలి ఉంటుంది. దక్షిణ భారతదేశంలో... నరక చతుర్దశి, దీపావళిగా... రెండు రోజుల పండుగగా దీన్ని నిర్వహిస్తారు. బెంగాల్ ప్రాంతంలో కాళీ పూజలు, తమిళనాడులో ప్రత్యేకంగా పితృ పూజలు చేస్తారు. దీపావళి ముందురోజే ఇంట్లో అందరూ తైలంతో అభ్యంగన స్నానం చెయ్యాలి. తైలంలో లక్ష్మి, జలంలో గంగ సూక్ష్మరూపంలో ఉంటారని శాస్త్రాలు చెప్పాయి. అలాగే దీపావళి రోజున కూడా సూర్యోదయానికి ముందే తలస్నానం చేయాలి. ఆ రెండు రోజులూ ఉదయాన్నే ఇష్ట దైవాలను పూజించాలి. దీపాలను వెలిగించి, పూజామందిరం దగ్గర, ఇంటి ముందు, తులసికోట దగ్గర ఉంచాలి. ఇకపోతే దీపావళికి కొత్తగా వ్యాపారాల లెక్కలను ప్రారంభించడం కూడా ఆనవాయితీ. అందుకే పూజలు చేసిన మరుసటి రోజు వ్యాపారులు తమ వ్యాపారలకు సెలవు ఇస్తారు.

# ఆదినా మసీదుపై మరోమారు వివాదం

## యూసుఫ్ పఠాన్ పోస్ట్‌తో తిరిగి గందరగోళం

**కోల్‌కతా, అక్టోబర్ 18 :** భారత మాజీ క్రికెటర్, తృణమూల్ కాంగ్రెస్ టీఎంసీ ఎంపీ యూసుఫ్ పఠాన్ చేసిన ఒక సోషల్ మీడియా పోస్ట్ పశ్చిమ బెంగాల్‌లో తీవ్ర రాజకీయ దుమారం రేపింది. మాల్దా జిల్లాలోని చారిత్రక అదినా మసీదుపై ఆయన చేసిన పోస్ట్‌తో పాత వివాదం మళ్లీ తెరపైకి వచ్చింది. ఈ కట్టడం మసీదు కాదని, అది ఆదినాథ్ ఆలయం అని బిజెపి వాదిస్తోంది. గురువారం యూసుఫ్ పఠాన్, మాల్దాలోని అదినా మసీదును సందర్శించిన ఫొటోలను 'ఎక్స్' లో పంచుకున్నారు. పశ్చిమ బెంగాల్‌లోని మాల్దాలో ఉన్న అదినా మసీదు ఒక చారిత్రక కట్టడం. దీనిని 14వ శతాబ్దంలో ఇలియాస్ షాహీ వంశానికి చెందిన రెండో పాలకుడు సుల్తాన్ సికందర్ షా నిర్మించారని అంటారు. 1373-1375 మధ్య కాలంలో నిర్మించిన ఈ మసీదు, అప్పట్లో భారత ఉపఖండంలోనే అతిపెద్దదిగా ఉండేది' అని పఠాన్ తన పోస్టులో పేర్కొన్నారు. పఠాన్ పోస్ట్ చేసిన కొద్దిసేపటికే బిజెపి బెంగాల్ శాఖ దీనిపై తీవ్రంగా స్పందించింది. అది అదినా మసీదు కాదని, ఆదినాథ్ ఆలయమని కౌంటర్ ఇచ్చింది. ఇదే సమయంలో పలువురు సోషల్ మీడియా యూజర్లు కూడా ఈ చర్చలో పాల్గొన్నారు. అనేక చారిత్రక ఆధారాలను ఉటంకిస్తూ, ఒక హిందూ దేవాలయాన్ని ధ్వంసం చేసి దానిపై ఈ కట్టడాన్ని నిర్మించారని యూసుఫ్ పఠాన్‌కు సూచించారు. ఆదినా మసీదు వివాదాలకు కేంద్రంగా నిలవడం ఇదే మొదటిసారి కాదు. గత ఏడాది, వృందావన్‌కు చెందిన విశ్వవిద్యా ట్రస్ట్ అధ్యక్షుడు హిరణ్మోరు గోస్వామి నేతృత్వంలోని పూజారుల బృందం ఈ కట్టడంలోకి ప్రవేశించి హిందూ సంప్రదాయం ప్రకారం పూజలు నిర్వహించింది. కట్టడం లోపల హిందూ దేవతల విగ్రహాలు ఉన్నాయని, ఇది ఒకప్పుడు ఆలయమేనని వారు వాదించారు. స్థానికుల సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకుని వారిని అడ్డుకున్నారు. ఈ ఘటన తర్వాత, భారత పురావస్తు శాఖ గోస్వామిపై కేసు నమోదు చేసింది. వివాదం నేపథ్యంలో జాతీయ ప్రాముఖ్యత కలిగిన ఈ కట్టడాన్ని అధికారులు మూసివేశారు. భద్రతను కట్టుదిట్టం చేసి సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయడంతో పాటు, ఒక పోలీస్ చెక్‌పోస్ట్‌ను కూడా నెలకొల్పారు. అదినా మసీదును 1369లో బెంగాల్ సుల్తానేట్‌కు చెందిన సికందర్ షా నిర్మించారు. ఇది ఆ కాలపు ముస్లిం వాస్తుశిల్పానికి ఒక అద్భుతమైన ఉదాహరణ అని ఏఎస్ఐ పేర్కొంది. సికందర్ షా సమాధి కూడా ఇందులోనే ఉంది. తాజా పరిణామాల తో ఈ చారిత్రక కట్టడం మరోసారి వార్తల్లోకెక్కింది.



# నిండు గర్భిణిని హతమార్చిన మామ

## కుమురం భీం జిల్లాలో దారుణం..


**కుమురం భీం :** కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా దహేగాం మండలంలో దారుణం చోటు చేసుకుంది. గెర్రె గ్రామంలో రాణి అనే 9 నెలల గర్భిణిని ఆమె మామ సత్యనారాయణ హత్య చేశాడు. గొడ్డలి, కత్తితో నరికి ప్రాణాలు తీశాడు. సత్యనారాయణ కుమారుడు శేఖర్ అదే గ్రామంలో ఎదురింట్లో ఉండే రాణిని ఇటీవల ప్రేమ వివాహం చేసుకున్నాడు. వేర్వేరు కులాలు కావడంతో శేఖర్ తల్లిదండ్రులు పెళ్లికి అంగీకరించలేదు. ఈ క్రమంలో కుటుంబంలో కలహాలు చెలరేగాయి. దీంతో శేఖర్, తన భార్యతో కలిసి అత్తవారింట్లోనే ఉంటున్నాడు. శనివారం అత్తమామలతో పాటు శేఖర్ అడవికి వెళ్లినట్లు తెలుసుకున్న సత్యనారాయణ.. ఎవరూ లేని సమయం చూసి.. రాణిని దారుణంగా హత్య చేశాడు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.




# బస్సుల బందుతో ప్రయాణికుల ఇబ్బంది

- పండుగ ముందు బంద్ నిర్వహణపై ఆగ్రహం
- బస్సుల నిలిపివేతతో బస్టాండ్లలో పడిగాపులు

**హైదరాబాద్, అక్టోబర్ 18 :** దీపావళికి ముందు బంద్ నిర్వహించడంపై ప్రయాణికులు భగ్గుమన్నారు. పండగ ముందు బస్సులు బంద్ ఏంటని నిలదీసారు. బంద్ చేస్తున్న నాయకులతో పలుచోట్ల వాగ్వాదానికి దిగారు. బస్సులు బంద చేస్తే గ్రామాలకు ఎలా వెళ్లాలని అన్నారు. బీసీ బంద్ నేపథ్యంలో జూబ్లీ బస్టాండ్ నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లాల్సిన బస్సులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. భాజపా ఎంపీ ఈటల రాజేందర్ రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో జూబ్లీ బస్ స్టేషన్‌లో బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. మరోవైపు దీపావళి పండుగతో పాటు వారాంతపు సెలవులు ఉండడంతో వివిధ జిల్లాలకు వెళ్లాల్సిన ప్రయాణికులతో జేబీఎస్‌లో రద్దీ పెరిగింది. ముందస్తు సమాచారం లేకపోవడంతో బస్ స్టేషన్‌లో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వీలైనంత త్వరగా బస్సులను ప్రారంభించాలని కోరారు. కుటుంబ సభ్యులు, చిన్నారులు, వయోవృద్ధులతో గంటల తరబడి బస్ స్టేషన్‌లో వేచి ఉన్నట్లు ప్రయాణికులు చెప్పారు. మరోవైపు ప్రధాన బస్టాండ్





ఎంజీబీఎస్‌లోనూ ప్రయాణికులు బస్సులు లేక పడిగాపులు కాసారు. కరీంనగర్, నిజామాబాద్, వరంగల్, విజయవాడ, ఖమ్మం, సిద్దిపేట, సూర్యాపేట, నల్గొండ తదితర ప్రాంతాలకు వెళ్లాల్సిన వారు బస్సులు దొరక్క తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు ఇదే అదనుగా క్యాబ్ డ్రైవర్లు అధిక మొత్తంలో వసూలు చేస్తున్నారు. దీంతో ఆర్టీసీ బస్సుల కోసం ప్రయాణికులు బస్టాండ్లలో గంటల కొద్దీ నిరీక్షిస్తున్నారు.



## ముల్కనూర్ మత్స్య పారిశ్రామిక సంఘ కార్యవర్గంపై కేసు నమోదు

- చేపల చెరువును లీజుకు ఇస్తామని డబ్బులు వసూలు
- ఆపై మరొకరికి మోసపూరితంగా చెరువు లీజు

**భీమదేవరపల్లి, రాజముద్ర న్యూస్:** కమలాపూర్ గ్రామానికి చెందిన అశోక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముల్కనూర్ మత్స్య పారిశ్రామిక సంఘం అధ్యక్షుడు శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు అలుగు సంపత్, కార్యదర్శి నాగరాజు, డైరెక్టర్లు కనకయ్య, రాంబాబు, పోచయ్య, రవి, మొగిలి, పెద్ద కనకయ్యలపై ముల్కనూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కావడం జరిగింది. బాధితుడు అశోక్ తెలిపిన వివరాల ప్రకారం ముల్కనూర్ గ్రామంలోని చేపల చెరువును లీజుకు ఇస్తామని నమ్మించి తన వద్ద నుంచి డబ్బులు తీసుకున్నారని, అనంతరం ఆ చెరువును నారాయణగిరి గ్రామానికి చెందిన సంపత్ అనే వ్యక్తికి మోసపూరితంగా లీజుకు ఇచ్చి తనను ఆర్థికంగా నష్టపరిచారని అశోక్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అశోక్ ఫిర్యాదు మేరకు ముల్కనూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.



## బీసిల రాష్ట్ర బంద్ విజయవంతం

### బీసీ జేఏసీ ములుగు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీకాంత్ గౌడ్

**ములుగు, రాజముద్ర న్యూస్ :** స్థానిక సంస్థల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల సాధన కోసం నిర్వహించిన బంద్ కు అన్ని పార్టీలు, కుల సంఘాలు, బిసి సంఘాలు, ప్రజా సంఘాలు, వర్తక వ్యాపార సంఘాలు సంపూర్ణంగా పాల్గొని విజయవంతం చేశారని, బిసి జాక్ ములుగు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తోటకూరి శ్రీకాంత్ గౌడ్ అన్నారు. శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ...బంద్ ప్రశాంతంగా, శాంతియుతంగా నిర్వహించామని,42 శాతం రిజర్వేషన్లు రాజ్యాంగ బద్దంగా ప్రభుత్వం కల్పిస్తూ జారీచేసిన జిఓపై హైకోర్టు స్టే ఇవ్వడం అన్యాయమని,స్థానిక సంస్థలకు ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తరువాత స్టే ఇవ్వడం సుప్రీంకోర్టు తీర్పుకు వ్యతిరేకమన్నారు. ఈ డబ్ల్యూ ఎస్ రిజర్వేషన్లను తాము వ్యతిరేకించలేదని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, టిఆర్ఎస్ పార్టీ నాయకులు, బిజెపి నాయకులు, యువజన నాయకులు, ప్రజా సంఘాలు పాల్గొన్నారు




## విష్ణుపురి కాలనీలో శాశ్వత ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటు

### ముఖ్య అతిథిగా హాజరైన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి

**పీర్జాదిగూడ, రాజముద్ర న్యూస్:** పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 17వ డివిజన్ విష్ణుపురి కాలనీ రోడ్డు నెంబర్ 23 లో నూతనంగా ఏర్పాటు చేసిన శాశ్వత ఆధార్ నమోదు కేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. యజమాని వెంకటేష్ ఆహ్వానం మేరకు, ఈ కార్యక్రమానికి పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ఆర్.వి. ఫౌండేషన్ చైర్మన్ తుంగతుర్తి రవి ముఖ్య అతిథిగా హాజరై వారికి శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ సందర్భంగా తుంగతుర్తి రవి మాట్లాడుతూ... ప్రజలకు ఆధార్ సేవలు సులభంగా అందుబాటులోకి రావడం చాలా సంతోషకరం. ఆధార్ కార్డు ఇప్పుడు ప్రతి పౌరుడికి అత్యవసరమైన పత్రం. ప్రజలందరూ ఈ ఆధార్ నమోదు కేంద్రమును సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో కాలనీ ప్రెసిడెంట్ అమర్నాథ్, సోమలింగం, సత్య నారాయణ, యజమాని వెంకటేష్ కుటుంబ సభ్యులు, కాలనీ వాసులు, బంధువులు, స్నేహితులు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.




## పర్యావరణ పరిరక్షణలో భాగంగా గోవిజ్ఞాన పరీక్ష

### ప్రతిభను చాటుకున్న విద్యార్థిని విద్యార్థులు

**సూర్యాపేట,రాజముద్ర న్యూస్ :** సూర్యాపేట జిల్లా కేంద్రం లో సరస్వతి విద్యాలయంలో గోసేవా విభాగం ఆధ్వర్యంలో శనివారం జిల్లా స్థాయి గోవిజ్ఞాన పరీక్షలు- 2025, లెవెల్-2 లో దాదాపు 25 పాఠశాలలు150 విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సరస్వతి విద్యా పీఠం నల్గొండ విభాగ్ కార్యదర్శి యానాల వెంకట్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా గోమాత మూత్రం ఉపయోగాలు, గోమాత నుండి వచ్చే వ్యర్థాలను వర్మి కంపోస్ట్ గా మార్చుకునే విధానం,గోమాత నుండి వచ్చే పాలు పెరుగు నెయ్యి మన ఆరోగ్యానికి ఎలా ఉపయోగపడతాయో వాటి గురించి వివిధ పాఠశాల విద్యార్థిని విద్యార్థులుచాలా చక్కగా రాసి విజేతలుగా నిలవడం అభినందనీయమని అన్నారు. ఈ పరీక్షలో మొదటి బహుమతిగా సిటీ టాలెంట్ విద్యార్థులు,రెండవ బహుమతి సృజన పాఠశాల విద్యార్థి గెలుచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉప్పల రవి కుమార్,డా.వి.చంద్రశేఖర శాస్త్రి , ప్రాంత గోకథ ప్రముఖ్, పి.పరిపూర్ణ చారి,జిల్లా గోసేవ ప్రముఖ్,సంధ్య, శ్రీధర్,హైమావతి తదితరులు పాల్గొన్నారు.

## బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలి

- రాష్ట్ర మున్నూరు కాపు సంయుక్త కార్యదర్శి బల్లెపు చంద్రశేఖర్
- ఉప్పల్ బస్ డిపో వద్ద బంద్ కార్యక్రమంలో పాల్గొన్న పలువురు మున్నూరు కాపు సంఘం నాయకులు




**పీర్జాదిగూడ, రాజముద్ర న్యూస్:** తెలంగాణ రాష్ట్రంలోని బీసీ కులాలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని రాజ్యాంగబద్ధంగా 9వ షెడ్యూల్లో చేర్చి బీసీ కులస్తులకు న్యాయం చేయాలని పీర్జాదిగూడ మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు, తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు సంఘం సంయుక్త కార్యదర్శి బల్లెపు చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన బీసీ బంద్ కార్యక్రమంలో భాగంగా ఉప్పల్ బస్ డిపో వద్ద నిరసన వ్యక్తం చేసి బంద్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బల్లెపు చంద్రశేఖర్ మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలో రాజకీయ పార్టీలకతీతంగా చేపట్టిన బంద్ కార్యక్రమం విజయవంతమైందని, బీసీలకు న్యాయం చేసే విధంగా అన్ని పార్టీలు మద్దతు ఇవ్వడం సంతోషకరమని అన్నారు. వెంటనే కేంద్ర ప్రభుత్వం బీసీలకు న్యాయం చేసే విధంగా బీసీ బిల్లును అంగీకరించి రాజ్యాంగబద్ధంగా 9వ షెడ్యూల్లో చేర్చి బీసీ కులస్తులకు న్యాయం చేయాలని కోరారు. బీసీ కులాల్లో ఎంతోమంది వెనుకబడిన ప్రజలు అట్టడుగున ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో లక్కాకుల సంజీవ పటేల్, వీరమల్ల జగన్నాదం పటేల్, కోనేటి వెంకట్ పటేల్, మన్నె సోమయ్య పటేల్, యాసం నరేష్ పటేల్, తోట పాపయ్య పటేల్, గజ్జెల ఆంజనేయులు పటేల్ తదితరులు పాల్గొన్నారు.

## మేడిపల్లి ప్రభుత్వ పాఠశాలలో దీపావళి దీపాలు పంపిణీ

### ప్రధానోపాధ్యాయులు ఎల్ సత్య ప్రసాద్

- బోధి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థినులకు దీపాలు పంపిణీ
- సంతోషం వ్యక్తం చేసిన పాఠశాల విద్యార్థినీలు, ఉపాధ్యాయులు




**మేడిపల్లి, రాజముద్ర న్యూస్:** దీపావళి పండుగను పురస్కరించుకొని బోధి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మేడిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పాఠశాలలో చదివే విద్యార్థినీలకు దీపావళి దీపాలు పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎల్ సత్య ప్రసాద్, పాఠశాల ఉపాధ్యాయ, ఉపాధ్యాయుల బృందం విద్యార్థినీలకు దీపాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఎల్. సత్య ప్రసాద్ మాట్లాడుతూ... ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలలు అంటే ప్రజల్లో ఒక విధమైన అభిప్రాయం ఉండేదని, ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వ పాఠశాలలో ప్రైవేట్ పాఠశాలల కంటే ధీటుగా విద్యాబోధన, విద్యార్థులకు అవసరమైన డిజిటల్ విద్యాబోధన, అదేవిధంగా ఆటపాటలతో కూడిన విద్య, విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకతను వెలికి తీయడమే ధ్యేయంగా పనిచేస్తున్నామని తెలిపారు. ఈ దీపావళి పండుగను పురస్కరించుకొని పాఠశాలలో చదివే విద్యార్థినీలకు దీపాలు పంపిణీ చేయడం ఆనందంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## శ్రమదానంతో పరిసరాల పరిశుభ్రత సాధ్యం

### మాజీ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి

- 25వ డివిజన్ పరిధిలోని సాయి హిల్స్ కాలనీలో స్థానిక ప్రజలతో కలిసి శ్రమదానం చేసిన మాజీ కార్పొరేటర్
- పాల్గొన్న కాలనీ అధ్యక్ష, కార్యదర్శులు, కమిటీ సభ్యులు, కాలనీవాసులు



**పీర్జాదిగూడ, రాజముద్ర న్యూస్:** మన ఇంటి పరిసరాలు, కాలనీలు పరిశుభ్రంగా ఉండాలంటే వారానికి ఒకరోజు శ్రమదానం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని పీర్జాదిగూడ నగర 25వ డివిజన్ మాజీ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి తెలిపారు. ఈమేరకు శనివారం 25వ డివిజన్ పరిధిలోని సాయి హిల్స్ కాలనీలో కాలనీ అసోసియేషన్ సభ్యులతో కలిసి శ్రమదానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి పాల్గొని కాలనీ వాసులతో కలిసి కాలనీ పరిశుభ్రతలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా ఉన్న గడ్డిని, పిచ్చి మొక్కలను తొలగించడం జరిగింది. ఈ శ్రమదాన కార్యక్రమంలో కాలనీ అధ్యక్ష, కార్యదర్శులు మధుసూదన్, మోహన్ రెడ్డి, భానుశేఖర్, రాంలింగారెడ్డి, రాజేశ్వరి, వేణుగోపాల్, హరి, అశోక్ రెడ్డి, పోతురాజు, రాకేష్ రెడ్డి, మహేందర్ రెడ్డి, మహేష్, రఘు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



## కోర్టు డ్యూటీ పోలీసు సిబ్బందికి శిక్షణ

- కేసుల్లో నేరస్తులకు త్వరగా శిక్షలు పడేలా కృషి చేయాలి
- సూర్యాపేట జిల్లా ఎస్పి నరసింహా

**సూర్యాపేట, రాజముద్ర న్యూస్ :** జిల్లాలోని పోలీస్ స్టేషన్ల నుండి కోర్టు విధుల పర్యవేక్షణ కోసం పనిచేస్తున్న కోర్టు డ్యూటీ పోలీసు సిబ్బందికి జిల్లా పోలీస్ కార్యాలయం నందు జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ ఆధ్వర్యంలో ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కోర్టు విధుల నిర్వహణకు సంబంధించి సలహాలు సూచనలు అందించారు,పనిలో నాణ్యత, పారదర్శకత ఉండాలని అని అన్నారు, పెండింగ్ ఉండకుండా పని చేయాలి,కోర్టు వారెంట్, సమన్లు సకాలంలో అందజేయాలి,సిబ్బంది కోర్టులలో సమన్వయంగా,సమయపాలనతో పనిచేయాలని,ఎప్పటికప్పుడు కేసుల స్థితిగతులను రికార్డులలో, అంతర్జాలంలో నమోదు చేసుకోవాలని సూచించారు. బాధితులను,సాక్షులను, నిందితులను సకాలంలో కోర్టులకు ప్రవేశపెట్టి కేసులు పరిష్కారం అయ్యేలా పనిచేయాలని సూచించారు. కేసుల్లో త్వరితగతిన నేరస్తులకు శిక్షలు అమలు అయితేనే క్షేత్రస్థాయిలో నేరాలను అదుపు చేయవచ్చు అని సూచించారు. ఒక లక్ష్యంతో పని చేయాలని కోర్టు అధికారులతో ఎప్పటికప్పుడు సమాచారాన్ని చేరవేసుకోవాలని తెలిపారు. ఈ సమావేశం నందు అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి,డిసిఆర్బి డిఎస్పి రవి,ఇన్స్పెక్టర్ హరిబాబు, కోర్టు డ్యూటీ పోలీస్ సిబ్బంది ఉన్నారు.



బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర బంద్ కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు



టిఆర్‌పి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టె జానయ్య యాదవ్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ



శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్: శనివారం శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని గుల్మొహర్ పార్క్ సిగ్నల్ మసీద్‌బండ్ సర్కిల్ వద్ద బీసీ రిజర్వేషన్‌కు సమర్థనగా నిర్వహించిన బంద్‌కు గ్రేటర్ హైదరాబాద్ బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మారబోయిన రవి యాదవ్ భారీ హాజరుతో మద్దతు ప్రకటించి పాల్గొనారు.



శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్: బీసీ బందు కార్యక్రమంలో అనిల్ కుమార్ యాదవ్, బిసి ముఖ్య నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





## వాజేడులో కదం తొక్కిన బీసీ సంఘాలు

### ప్రశాంతంగా ముగిసిన బీసీ బంద్

**వాజేడు, రాజముద్ర న్యూస్ :** బీసీల 42 శాతం రిజర్వేషన్ బిల్లు సాధన కోసం శనివారం బీసీ సంఘాల నేతలు, వాజేడు, జగన్నాధపురం వై జంక్షన్ 163 జాతీయ రహదారిపై నిరసన చేపట్టారు. వాహనాలు రాకపోకలు నిలిచాయి. విద్యా ఉద్యోగ స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించాలని,డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన కూడా రాజకీయ రంగంలో,పాలనలో బీసీలకు రిజర్వేషన్ లేకపోవడం దుర్మార్గమని, విద్యా ఉద్యోగ,రాజకీయ రంగాల్లో జనాభా ప్రకారం బీసీ రిజర్వేషన్ కోసం గత 70 ఏళ్లుగా బీసీ సంఘాల నేతలు,బీసీ సమాజం కోసం పోరాటం చేస్తూనే ఉన్నారని,కామారెడ్డి డిక్లరేషన్ అమలు వరకు ఎన్నో పోరాటాలు చేశారన్నారు. స్థానిక సంస్థల రిజర్వేషన్ పెంచాల్సిందేనని డిమాండ్ చేశారు. వ్యాపార వాణిజ్య వర్గాలు స్వచ్ఛందంగా బంద్ పాటించారు. ఎటువంటి అవాంఛనియా సంఘటనలు జరగకుండా వెంకటాపురం సిఐ ముత్యం రమేష్, వాజేడు ఎస్సై జక్కుల సతీష్, సివిల్,సిఆర్పిఎఫ్, సిబ్బంది బందోబస్తు చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ కులాల నేతలు,రాజకీయ పార్టీ కార్యకర్తలు పాల్గొని బీసీ బంద్ ను ప్రశాంతంగా విజయవంతం చేశారు.

## మీరు రగిలించిన నిప్పు..
# మీ ఇంటినే కాలుస్తోంది
### అసీం మునీర్‌పై తీవ్ర విమర్శలు



**అఫ్గానిస్థాన్ :** పాకిస్థాన్–అఫ్గానిస్థాన్ మధ్య ఘర్షణలు మళ్లీ భగ్గుమన్నాయి. అఫ్గాన్‌లోని పాక్టికా ప్రావిన్స్‌పై పాక్ వైమానిక దాడులకు పాల్పడింది. ఈ ఘటనలో ముగ్గురు యువ క్రికెటర్లు సహా పలువురు మృతి చెందారు. ఈ క్రమంలో పాక్ ఆర్మీ చీఫ్ అసీం మునీర్ పై అఫ్గాన్ మాజీ ఎంపీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మునీర్ ఎగదోస్తున్న ఉగ్రవాదం అనే మంట.. ఆయన ఇంటినే (పాక్‌ను ఉద్దేశిస్తూ) కాల్చేస్తోందని వ్యాఖ్యానించారు. తాజా దాడులపై అఫ్గాన్ మాజీ ఎంపీ మరియం సోలైమాంఖిల్ ఓ వార్తా సంస్థతో మాట్లాడారు. పాక్‌ది పిరికి చర్య అంటూ దాడులను తీవ్రంగా ఖండించారు. భారత్, అఫ్గాన్‌లపై పాక్ నిఘా సంస్థ ఐఎస్ఐ, దాని సైన్యం దశాబ్దాలుగా ఇదే హింసకు పాల్పడు తోందన్నారు. వాళ్లు చేసే దాడుల్లో యువ క్రికెటర్లు, చిన్నారులు ప్రాణాలు కోల్పోవడం హృదయ విదారకరమన్నారు. ఈ క్రమంలోనే ఆమె పాక్ ఆర్మీ చీఫ్ అసీం మునీర్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. దశాబ్దాలుగా ఉగ్రవాదుల్ని పెంచి, వారిని ఆయుధాలుగా ఉపయోగిస్తున్నారన్నారు. 'మీరు ఎగదోసిన మంటే.. మీ సొంత ఇంటిని కాల్చేస్తోందని గుర్తుపెట్టుకోండి' అని వ్యాఖ్యానిం చారు. ఇక, అఫ్గాన్‌కు భారత్ మద్దతును ఆమె ప్రశంసించారు. ఇటీవల అఫ్గాన్ విదేశాంగ మంత్రి అమీర్ ముత్తాఖీ ఇక్కడ పర్యటించిన విషయాన్ని ప్రస్తావిం చారు. భారత్‌కు అఫ్గాన్ దగ్గరవ్వడాన్ని పాక్ సహించలేకపోతుందని విమర్శిం చారు. మా ఇరుదేశాల మధ్య శాంతిని చూడలేకపోతుందని ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా తీవ్రవాద భావజాలానికి వ్యతిరేకంగా భారత్– అఫ్గాన్‌ల మధ్య బలమైన సహకారం ఉండాలని ఆమె పిలుపునిచ్చారు. శుక్రవారం అర్ధరాత్రి అఫ్గాన్‌పై పాక్ వైమానిక దాడులకు పాల్పడింది. ఈ ఘటనలో 10 మంది మృతి చెందినట్లు తెలుస్తోంది. ఇందులో ముగ్గురు క్రికెటర్లు ఉన్నారు. ఈ నేపథ్యంలోనే వచ్చే నెలలో పాకిస్థాన్, శ్రీలంక జట్లతో తలపడబోయే ముక్కోణపు సిరీస్ నుంచి వైదొలుగుతున్నట్లు అఫ్గానిస్థాన్ క్రికెట్ బోర్డు ప్రకటించింది. 48 గంటల కాల్పుల విరమణ పూర్తయిన వెంటనే ఈ దాడులు జరగడం గమనార్హం.

## మా త్యాగాలను అర్థం చేసుకోలేదు
### అఫ్గాన్‌తో ఘర్షణల వేళ వాపోయిన పాక్ మంత్రి



**పాకిస్థాన్ :** అఫ్గానిస్థాన్–పాకిస్థాన్ మధ్య ఘర్షణలు మరోసారి భగ్గుమన్నాయి. ఈ రెండు దేశాల మధ్య శుక్రవారం సాయంత్రం కాల్పుల విరమణ ఒప్పందం ముగిసిన నేపథ్యంలో పాక్ రక్షణ మంత్రి ఖ్వాజా ఆసిఫ్ అఫ్గాన్‌కు వార్నింగ్ ఇచ్చారు. అలాగే తమ త్యాగాలను తాలి బన్ ప్రభుత్వం అర్థం చేసుకోలేదన్నారు. ఈ సందర్భంగా మరోసారి భారత్‌పైనా ఆరోపణలు చేశారు. "ఇకనుంచి నిరసన తెలియజేయడాలు, శాంతి కోసం పిలుపు నివ్వడాలు ఉండవు. కాబుల్‌లో మా ప్రతినిధుల బృందం పర్యటించదు. ఉగ్రవాదానికి మూలం ఎక్కడ ఉన్నా.. భారీ మూల్యం చెల్లించక తప్పదు. భారత్‌కు కాబుల్ అనుబంధ సంస్థలా వ్యవహరిస్తోంది. రెండూ కలిసి పాక్‌కు వ్యతిరేకంగా కుట్రలు పన్నుతున్నాయి. తెహ్రీకే తాలిబన్ పాకిస్థాన్ కూడా ఈ కుట్రలో భాగమవుతుంది. ఇప్పుడు అఫ్గాన్‌ను పాలిస్తున్నవారు (తాలిబన్లు) ఒకప్పుడు మాపై ఆధారపడ్డారు. మా దేశంలో తలదాచుకున్నారు. అఫ్గాన్‌తో గతంలో మాదిరిగా సంబంధాలు కొనసాగించలేం" అని సామాజిక మాధ్యమాల వేదికగా వ్యాఖ్యలు చేశారు. "మా దేశంలో నివసిస్తోన్న అఫ్గాన్ ప్రజలు వారి స్వదేశానికి వెళ్లిపోవాలి. వారికి ఇప్పుడు వారి సొంత ప్రభుత్వం ఉంది. మా వనరులు మా ప్రజల కోసం మాత్రమే. కొన్నేళ్లుగా మేం ఎన్నో త్యాగాలు చేసినప్పటికీ.. కాబుల్ నుంచి సానుకూల స్పందన రాలేదు" అని మంత్రి వాపోవడం గమనార్హం. ఇదిలాఉంటే.. శుక్రవారం రాత్రి అఫ్గాన్‌పై పాక్ వైమానిక దాడులు నిర్వహించింది. ఈ ఘటనలో 10 మంది మరణించినట్లు తెలుస్తోంది. వారిలో ముగ్గురు క్రికెటర్లు ఉన్నారని అఫ్గానిస్థాన్ క్రికెట్ బోర్డ్ వెల్లడించింది. తాజా దాడులతో 48 గంటల కాల్పుల విరమణ ఒప్పందం వీగిపోయింది. ఇప్పుడు రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు ఏస్థాయికి చేరతాయోననే ఆందోళన వ్యక్తమవుతోంది. ఇదిలాఉంటే.. అఫ్గాన్‌కు భారత్ సహకరిస్తోందంటూ పాక్ పదేపదే చేస్తోన్న ప్రేలాపనలకు మన విదేశాంగ శాఖ గట్టి కౌంటర్ ఇచ్చింది. తన అంతర్గత వైఫల్యాలకు పొరుగు వారిని నిందించటం ఆ దేశానికున్న అలవాటని మండిపడింది.



## బోటు బోల్తా..
### ముగ్గురు భారతీయులు మృతి


**మొజాంబిక్ :** ఆఫ్రికా దేశమైన మొజాంబిక్‌లో బెయిరా ఓడరేవు సమీపంలో బోటు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ముగ్గురు భారతీయులు మృతి చెందగా.. మరో అయిదుగురు గల్లంతయ్యారు. 14 మంది భారతీయ సిబ్బందితో సహా మరికొందరిని తీసుకెళ్తున్న బోట్ బోల్తా పడిన ఘటనలో ముగ్గురు భారతీయులు మరణించగా, ఐదుగురు గల్లంతైనట్లు భారత హైకమిషన్ శనివారం ధ్రువీకరించింది. మిగిలిన వారిని స్థానిక సిబ్బంది రక్షించినట్లు తెలిపింది. శుక్రవారం బెయిరా ఓడరేవు వద్ద సిబ్బంది బదిలీ ఆపరేషన్ల సమయంలో ఈ ప్రమాదం జరిగినట్లు వెల్లడించింది. బోటు బోల్తా పడటానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదని.. ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగుతోందని అధికారులు పేర్కొన్నారు. గల్లంతైన వారికోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయన్నారు. క్షతగాత్రులు బెయిరాలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు భారత హైకమిషన్ వెల్లడించింది. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను తమ అధికారులు సందర్శించారని తెలిపింది. మృతుల కుటుంబాలను సంప్రదించి.. వారికి కావాల్సిన సహాయాన్ని అందిస్తున్నట్లు పేర్కొంది. అయితే మృతుల పేర్లు, వివరాలు తెలియాల్సి ఉంది. గల్లంతైన వారి ఆచూకీ కోసం స్థానిక అధికారులు, సముద్ర సంస్థలు, భారత దౌత్య కార్యాలయం సమన్వయంతో పనిచేస్తున్నాయని అధికారులు పేర్కొన్నారు. ఈ ఘటనలో క్షతగాత్రులకు సంబంధించిన వివరాలు తెలుసుకోవడానికి సంప్రదించాల్సిన అత్యవసర నంబర్‌లను కూడా హైకమిషన్ సోషల్ మీడియాలో షేర్ చేసింది.

# పాక్-అఫ్గాన్ ఘర్షణలు
### వాటిని ఆపడం నాకు చాలా తేలిక : ట్రంప్



**వాషింగ్టన్ :** కాల్పుల విరమణ అనంతరం పాకిస్థాన్–అఫ్గానిస్థాన్ మధ్య ఘర్షణలు భగ్గుమన్నాయి. ఈ క్రమంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. వాటి మధ్య సంఘర్షణలను ఆపడం తనకు తేలికన్నారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తో కలిసి ట్రంప్ విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన పాక్–అఫ్గాన్ మధ్య నెలకొన్న ఘర్షణల గురించి ప్రస్తావించారు. అఫ్గాన్‌పై పాక్ దాడి చేసిందనే విషయం తనకు అర్థమైందన్నారు. ఈ సంఘర్షణను పరిష్కరించాల్సి వస్తే.. అది తనకు చాలా సులభమన్నారు. అదే సమయంలో తాను యూఎస్‌ను పాలించాలన్నారు. అయినప్పటికీ.. యుద్ధాలను ఆపడం అంటే తనకు చాలా ఇష్టం అని వ్యాఖ్యానించారు. ఎందుకంటే ప్రజల ప్రాణాలు కోల్పోకుండా ఆపడం తనకు నచ్చుతుందన్నారు. ఈసందర్భంగా తాను ఇప్పటికే లక్షల మంది ప్రాణాలు కాపాడానని ఉద్ఘాటించారు. ఈ సందర్భంగా తాను ఎనిమిది యుద్ధాలు కొనసాగకుండా ముగించానని ట్రంప్ ఉద్ఘాటించారు. ఇదే క్రమంలో భారత్– పాక్ మధ్య ఘర్షణలను కూడా తానే ఆపానంటూ మరోసారి ప్రకటించుకున్నారు. ఎన్నింటిని ఆపినా తనకు నోబెల్ బహుమతి రావడం లేదని నిరాశ వ్యక్తంచేశారు. ఈ ఏడాదికి గాను నోబెల్ శాంతి బహుమతి అందుకున్న వెనుజువెలా ప్రతిపక్ష నాయకురాలు మరియా కొరినా మచాదో గురించి కూడా ట్రంప్ ఇక్కడ ప్రస్తావించారు. ఆ అవార్డు ఒక అందమైన మహిళకు దక్కిందన్నారు. అయినా.. తాను ప్రాణాలను కాపాడటం మీదే శ్రద్ధ వహిస్తానన్నారు. పాక్–అఫ్గాన్‌ల మధ్య 48 గంటల కాల్పుల విరమణ ఒప్పందం ముగిసిన అనంతరం ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ కాల్పుల విరమణ పొడిగింపు, సమస్య పరిష్కారానికి ఇరుపక్షాలు దోహాలో సమావేశం కానున్నట్లు పలు మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ క్రమంలోనే ఇరుదేశాల బలగాల మధ్య ఘర్షణలు చోటుచేసుకోవడం గమనార్హం. పాక్టికా ప్రావిన్స్‌లోని పలు ప్రాంతాల్లో పాక్ వైమానిక దాడులకు పాల్పడినట్లు తాలిబన్లు తెలిపారు. ఈ దాడుల నేపథ్యంలో ఇరుపక్షాల మధ్య ఉన్న కాల్పుల విరమణ ఒప్పందం వీగిపోయిందన్నారు.

# వెంటనే యుద్ధం ఆపండి
### జెలెన్‌స్కీతో భేటీ అనంతరం ట్రంప్ కీలక వ్యాఖ్యలు



**వాషింగ్టన్ :** ఉక్రెయిన్–రష్యాల యుద్ధం ముగించేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కట్టుబడి ఉన్నారు. ఈ క్రమంలో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో భేటీ అనంతరం ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరుదేశాలు వెంటనే యుద్ధం ముగించాలని పిలుపునిచ్చారు. యుద్ధం ముగింపు అంశంపై వైట్‌హౌస్‌లో జెలెన్‌స్కీ తో ట్రంప్ సుదీర్ఘంగా చర్చలు జరిపారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. ఇరుదేశాలు వెంటనే యుద్ధం ఆపేయాలని పిలుపునిచ్చారు. ఇరువైపులా దళాలు ఇంటికి తిరిగివెళ్లాలని ఆకాంక్షించారు. జెలెన్‌స్కీతో భేటీ చాలా సానుకూలంగా, ఆసక్తికరంగా జరిగిందని ట్రూత్ సోషల్ వేదికగా పోస్టు పెట్టారు. ఇరు దేశాలు యుద్ధం ముగిపునకు ముందుకురావాలని ఉద్ఘాటించారు. ఇప్పటికే యుద్ధంలో అనేకమంది రక్తం చిందించారని వ్యాఖ్యానించారు. దీన్ని ముగించాలని జెలెన్‌స్కీ, పుతిన్‌లు కూడా కోరుకుంటున్నారని తాను భావిస్తున్నట్లు తెలిపారు. ఇప్పుడు వారిరువురూ కలిసి ఉండాలని కోరారు. ఘర్షణల్లో ప్రతీవారం వేలాది మంది ఊచకోతకు గురవుతున్నారని, ఇకనైనా ఇలాంటివి ఆపాలని వ్యాఖ్యానించారు. ఇకపై కాల్పులు, మరణాలు, యుద్ధం కోసం పెద్ద మొత్తంలో డబ్బు ఖర్చు చేయడం వంటివి ఉండబోవన్నారు. తాము దీన్ని ముగిస్తామన్నారు. ఇక, హంగేరీలో రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో భేటీకి ట్రంప్ సిద్ధమైన సంగతి తెలిసిందే. ఇందులో జెలెన్‌స్కీ కూడా పాల్గొంటారా అనే దానిపై నిర్ణయం తీసుకోవాల్సి ఉందని ట్రంప్ తెలిపారు. అయితే, అలా జరిగితే అది మంచి సమావేశం అవుతుందని అభిప్రాయపడ్డారు. ఇదిలాఉండగా.. యుద్ధం ముగింపునకు సమయం ఆసన్నమైందని ట్రంప్‌తో భేటీ అనంతరం జెలెన్‌స్కీ పేర్కొన్నారు. కీలక అంశాలపై ఇద్దరం చర్చలు జరిపామన్నారు. యుద్ధం ప్రారంభించిన రష్యా ఉద్దేశపూర్వకంగానే దీన్ని పొడిగిస్తుందని ఆరోపించారు. దీన్ని వెంటనే ముగించాలని కోరారు. దీనికి సంబంధించి అమెరికా చేస్తున్న ఒత్తిడిపై నమ్మకంగా ఉన్నామన్నారు.

## జీఎస్టీ ధమాకాతో
# రికార్డు స్థాయిలో కొనుగోళ్లు
### నిర్మలా సీతారామన్




**న్యూఢిల్లీ :** ఎన్డీఏ ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త జీఎస్టీ సంస్కరణల వల్ల దేశంలో కొనుగోళ్లు పెరుగుతున్నాయని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. సెప్టెంబర్ 22న తీసుకువచ్చిన సంస్కరణల వల్ల వినియోగదారుల్లో కొనుగోలు శక్తి పెరిగిందన్నారు. జీఎస్టీ 2.0 ద్వారా ప్రజలు ఊహించిన దానికంటే ఎక్కువ పన్ను తగ్గింపులు చేపట్టామన్నారు. అందువల్లే వినియోగదారులు ఆశించిన దానికంటే ఎక్కువ ప్రయోజనాలను పొందుతున్నారన్నారు. దసరా సమయంలో ప్రజలు రికార్డు స్థాయిలో చేసిన కొనుగోళ్ల ద్వారా సంస్కరణల ప్రభావం కనిపిస్తోందని చెప్పారు. జీఎస్టీ 2.0పై కేంద్రమంత్రులు నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. జీఎస్టీ సంస్కరణలపై నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర మంత్రులు పీయూష్ గోయల్, అశ్వినీ వైష్ణవ్ పాల్గొన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం తీసుకువచ్చిన జీఎస్టీ సంస్కరణలతో దేశమంతా పండగ వాతావరణం నెలకొందని ఆనందం వ్యక్తం చేశారు. ఈ సంస్కరణలు దేశ ప్రజలకు ప్రధాని మోదీ ఇచ్చిన దీపావళి కానుక అని పీయూష్ గోయల్ అన్నారు. జీఎస్టీ డబుల్ ధమాకాతో మోదీ దేశప్రజల ఇంటికి లక్ష్మీదేవిని తీసుకువచ్చారన్నారు. జీఎస్టీ సంస్కరణలు అన్ని రంగాల్లో ఉత్సాహాన్ని తీసుకువచ్చాయని..వీటితో దేశంలోని అన్ని రంగాలు లాభపడతాయని విశ్వాసం వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ జీఎస్టీ సంస్కరణ సమయంలో దేశంలో వినియోగం, డిమాండ్ ఎలా పెరుగుతుందనే దాని గురించి అనేక అంచనాలు రూపొందించినట్లు తెలిపారు. ఈ సంస్కరణల కారణంగా దేశంలో వినియోగం పెరుగుతోందని.. ఈ ఏడాది దాదాపు రూ.20 లక్షల కోట్ల అదనపు వినియోగం జరిగే అవకాశం ఉందని అన్నారు. అమెరికాకు స్మార్ట్‌ఫోన్‌లను ఎగుమతి చేయడంలో భారత్ తన పొరుగు దేశాన్ని అధిగమించిందని చైనాను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఇది దేశం సాధించిన అతిపెద్ద విజయమన్నారు. స్మార్ట్‌ఫోన్లు తయారు చేసే పలు అతిపెద్ద కంపెనీలు వాటి తయారీలో దాదాపు 20శాతాన్ని భారత్‌లోనే చేపడుతున్నాయని పేర్కొన్నారు.

## బెంగళూరు రోడ్లపై
# మజుందార్ షా విమర్శలు
### వ్యంగ్యంగా బదులిచ్చిన డీకే



**బెంగళూరు :** బెంగళూరు రోడ్ల పరిస్థితిపై ఇటీవల తీవ్ర చర్చ జరుగుతుంది. ఈ విషయంపై బయోకాన్ లిమిటెడ్ వ్యవస్థా పకురాలు కిరణ్ మజుందార్ షా విమర్శలు చేయడం చర్చనీ యాంశంగా మారింది. తాజాగా ఈ విషయంపై డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ వ్యంగ్యంగా బదులిచ్చారు. మజుందార్ షా రోడ్లను అభివృద్ధి చేయాలనుకుంటే చేయొచ్చంటూ డీకే పేర్కొన్నారు. ఆమె వచ్చి అడిగితే.. ఆ గుంతలు పూడ్చేందుకు నిధులు కేటాయిస్తామన్నారు. ఈ సందర్భంగా బెంగళూరు నగర అభివృద్ధికి తమ ప్రభుత్వం పెద్ద మొత్తంలో నిధులు కేటాయించిందన్నారు. గత కొంతకాలంగా బెంగళూరు రోడ్ల పరిస్థితిపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో బయోకాన్ పార్క్‌కు వచ్చిన ఓ విదేశీ విజిటర్.. నగరంలోని రోడ్లు, చెత్తపై చేసిన వ్యాఖ్యలతో తాను ఇబ్బందిపడ్డానని ఆమె ఓ పోస్టులో వెల్లడించారు. ఇది కాస్త వైరల్ అయ్యింది. దీనిపై కర్ణాటక మంత్రి ప్రియాంక్ ఖర్గే స్పందించారు. బెంగళూరులో అభివృద్ధి శరవేగంగా జరుగుతోందన్నారు. మౌలిక సదుపాయాలకు అవసరమైనవన్నీ చేస్తున్నామన్నారు. ఈ విషయంపై బ్లాక్‌బక్' అనే కంపెనీ సీఈఓ రాజేశ్ యాబాజీ కూడా గతంలో ఓ పోస్టు పెట్టారు.

## పాక్‌లోని ప్రతి అంగుళం
# బ్రహ్మోస్ రేంజ్‌లోనే..
### రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ వార్నింగ్



**న్యూఢిల్లీ :** పాక్‌లోని ప్రతి అంగుళం బ్రహ్మోస్ రేంజ్‌లోనే ఉందని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. ఆపరేషన్ సిందూర్ ట్రైలర్ మాత్రమేనని దాయాదిని హెచ్చరించారు. బ్రహ్మోస్ క్షిపణులను సైన్యానికి అప్పగించిన నేపథ్యంలో శనివారం మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. ఉత్తర్‌ప్రదేశ్ రాజధాని లఖ్‌నవూలో బ్రహ్మోస్ ఏరోస్పేస్ యూనిట్‌ను రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సందర్శించారు. ఆయనతో పాటు యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కూడా ఉన్నారు. ఇక్కడ తొలివిడత బ్రహ్మోస్ క్షిపణులను ఉత్పత్తి చేశారు. వాటిని కేంద్ర మంత్రి సైన్యానికి అప్పగించారు. ఈ సందర్భంగా సైన్యం పరాక్రమం, సంసిద్ధతను ప్రశంసించారు. భారత్ వద్ద ఉన్న అధునాతన క్షిపణి సామర్థ్యాల నుంచి శత్రుదేశం తప్పించుకోలేదని వ్యాఖ్యానించారు. ఇక్కడి బ్రహ్మోస్ బృందం ఒక నెలలోనే రెండుదేశాలతో రూ.4వేల కోట్ల ఒప్పందాలు కుదుర్చుకుంది. "రానున్న రోజుల్లో ఇతర దేశాల నుంచి నిపుణులు లఖ్‌నవూకు తరలివస్తారు. అలాగే వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి ఈ యూనిట్ టర్నోవర్ రూ.3వేల కోట్లు అవుతుంది. ప్రతి ఏటా రూ.5వేలకోట్ల మేర జీఎస్టీ వసూలు అవుతుంది" అని వెల్లడించారు.

## కొత్త ముసుగులో 'జంగల్‌రాజ్' : అమిత్ షా




**న్యూఢిల్లీ :** అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బిహార్‌లో ప్రచారం వేడెక్కుతోంది. ఈ క్రమంలోనే స్థానికంగా ఆర్జేడీ నేతృత్వంలోని ప్రతిపక్ష 'ఇండియా' కూటమిపై కేంద్ర మంత్రి అమిత్ షా విమర్శలు గుప్పించారు. కొత్త ముసుగు ధరించిన 'జంగల్‌రాజ్ (ఆటవిక రాజ్యం)'గా పేర్కొన్నారు. రాష్ట్రంలో మరోసారి ఎన్డీయే సర్కారు అధికారంలోకి వస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. మాజీ ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ స్థాపించిన జన్ సురాజ్ పార్టీ గురించి ఎన్నికల ఫలితాల అనంతరం మాట్లాడదామంటూ ఓ వార్తాసంస్థ కార్యక్రమంలో వ్యంగ్యంగా స్పందించారు. ఇన్నేళ్లు ప్రజాసమస్యలను పట్టించుకోని ఎన్డీయే సర్కారు.. ఎన్నికలకు ముందు అనేక ఉచితాలను ప్రకటించిందంటూ ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను అమిత్ షా ఖండించారు. "ప్రతిపక్షాలకు ఓటమి భయం పట్టుకుంది. కూటమికి ఎవరు నాయకత్వం వహిస్తారో.. ఎవరు ఎక్కడినుంచి పోటీ చేస్తారో వారికే తెలియదు" అని ఎద్దేవా చేశారు. మోదీ ప్రధాని అయినప్పటినుంచి బిహార్‌లో అనేక సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని తెలిపారు. కిడ్నాప్‌లు, కులాల ఘర్షణలకు తెరపడిందని ఇక్కడి పౌరులే అంగీకరిస్తారన్నారు. "గత పాలనలో బిహార్ ఓ గుంతలా మారింది. 20 ఏళ్లలో దీన్ని పూడ్చాం. ఇప్పుడు బలమైన పునాదులపై నిర్మాణాలు చేపడతాం. కొత్త ముసుగు ధరించి.. ఆటవిక రాజ్యాన్ని తిరిగి తీసుకురావాలని ఆశిస్తున్నవారిని ఓటర్లు నమ్మొద్దు. బిహార్‌లో పరిశ్రమల ఏర్పాటుకు సరిపడా భూములు లేకపోవచ్చు. కానీ.. నాణ్యమైన శ్రామిక శక్తి ఉంది. రాష్ట్రాన్ని 'ఏఐ' హబ్‌గా మార్చాలనుకుంటున్నాం" అని అమిత్ షా వ్యాఖ్యానించారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా భాజపా 101 స్థానాల్లో పోటీ చేయనున్న విషయం తెలిసిందే. వచ్చే నెల 6, 11వ తేదీల్లో రెండు దశల్లో పోలింగ్, 14న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.

## ఢిల్లీలో ఎంపీల నివాస సముదాయంలో అగ్ని ప్రమాదం

**ఢిల్లీ :** ఢిల్లీలో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఎంపీల నివాస సముదాయమైన బ్రహ్మపుత్ర అపార్ట్‌మెంట్స్‌లో పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక బృందాలు మంటలను అదుపులోకి తెచ్చాయి. రామ్‌మనోహర్ లోహియా ఆసుపత్రికి ఎదురుగా ఈ నివాస సముదాయం ఉంది. అనేక మంది లోక్‌సభ, రాజ్యసభ ఎంపీల నివాసాలు ఇందులో ఉన్నాయి. బాబా ఖరాగ్ సింగ్ మార్గ్‌లో ఉన్న బ్రహ్మపుత్ర అపార్ట్‌మెంట్స్‌లో మంటలు చెలరేగినట్లు సమాచారం అందుకున్న అధికారులు.. 14 ఫైర్ ఇంజిన్లను అక్కడ మోహరించారు. దాదాపు గంటపాటు శ్రమించిన అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చినట్లు అధికారులు వెల్లడించారు. ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ఈ నివాస సముదాయాన్ని 2020లో ప్రారంభించారు.

## సెక్స్ కుంభకోణంలో పేరు..
### రాయల్ టైటిల్ వదులుకున్న ప్రిన్స్



**యూఎస్ :** అమెరికాను కుదిపేసిన సెక్స్ కుంభకోణం కేసు పత్రాలలో దేశ మాజీ అధ్యక్షుడు బిల్ క్లింటన్, ప్రస్తుత అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, పాప్ సింగర్ మైఖేల్ జాక్సన్ సహా దాదాపు 200 మంది ధనవంతులు, శక్తిమంతుల పేర్లు ఉన్న విషయం తెలిసిందే. ఈ పత్రాలలో బ్రిటన్ యువరాజు ఆండ్రూ పేరు కూడా ఇటీవల బయటకువచ్చింది. ఈ నేపథ్యంలో ప్రిన్స్ ఆండ్రూ తన రాయల్ టైటిల్ 'డ్యూక్ ఆఫ్ యార్క్'ను వదులుకున్నారు. బ్రిటన్ రాజు చార్లెస్ ఒత్తిడి మేరకు ఆయన తన బిరుదును వదులుకున్నట్లు సమాచారం. ఇకపై తన బిరుదును, తనకు లభించే గౌరవాలను ఉపయోగించనని ప్రిన్స్ ఆండ్రూ సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. బ్రిటన్ రాజు చార్లెస్‌తో, తమ కుటుంబసభ్యుల తో చర్చల తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించారు. తనపై వస్తున్న ఆరోపణల వల్ల రాజ కుటుంబ కార్యకలాపాలకు ఎటువంటి ఆటంకాలు కలగకుండా ఉండేందుకే ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ఎప్‌స్టీన్ సెక్స్ కుంభకోణం అగ్రరాజ్యాన్ని కుదిపేసిన విషయం తెలిసిందే. పేద, మధ్య తరగతి బాలికలు, యువతులకు భారీ మొత్తం ఆశ చూపించి ఫ్లోరిడా, న్యూయార్క్, వర్జిన్ ఐలాండ్స్, మెక్సికోల్లోని నివాసాలకు పిలిపించి అఘాయిత్యాలకు పాల్పడేవాడనేది ప్రధాన ఆరోపణ. ఈ కుంభకోణానికి సంబంధించిన పత్రాల్లో.. ఎప్‌స్టీన్‌పై ఆరోపణలు చేసిన జొహన్నా సోబెర్గ్ ఇచ్చిన వాంగ్మూలంలో ప్రిన్స్ ఆండ్రూపై సంచలన ఆరోపణలు చేశారు. 2001లో తాను న్యూయార్క్ వెళ్లినప్పుడు ఎప్‌స్టీన్ నివాసంలో ఓ గ్రూప్ ఫొటో దిగామని, అప్పుడు ప్రిన్స్ తనని అసభ్యంగా తాకాడని పేర్కొన్నారు. ఇదే వాంగ్మూలంలో క్లింటన్, ట్రంప్ పేర్లను కూడా ఆమె ప్రస్తావించారు.

# పాక్ వైమానిక దాడి..

## ముగ్గురు అఫ్గాన్ క్రికెటర్లు మృతి




పొరుగు దేశాలతో ప్రశాంతంగా ఉండాలని పాకిస్థాన్‌కు అస్సలు అనిపించదేమో. మొన్నటివరకూ భారత్ మీదకు వచ్చి చావు దెబ్బతిన్న పాక్.. ఈసారి మరో సరిహద్దు దేశం అఫ్గానిస్థాన్‌పై దాడులకు పాల్పడింది. ఈస్టర్న్ పాక్టికా ప్రావిన్స్‌పై పాకిస్థాన్ వైమానిక దాడి చేసింది. ఈ ఘటనలో 8 మంది ప్రాణాలు కోల్పోగా, మరో ఏడుగురు గాయపడ్డారు. మృతుల్లో ముగ్గురు దేశవాళీ క్రికెటర్లు ఉన్నట్లు అఫ్గానిస్థాన్ క్రికెట్ బోర్డు తెలిపింది. దీంతో వచ్చే నెలలో పాకిస్థాన్, శ్రీలంక జట్లతో తలపడబోయే ముక్కోణపు సిరీస్ నుంచి వైదొలుగుతున్నట్లు ఏసీబీ ప్రకటించింది. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా సంతాపం తెలియజేస్తూ పోస్టు పెట్టింది. "పాక్టికా ప్రావిన్స్‌లోని ఉర్గున్ జిల్లాకు చెందిన ముగ్గురు క్రికెటర్లు పాక్ వైమానిక దాడిలో ప్రాణాలు విడిచారు. పాక్ ప్రభుత్వం ఆధ్వర్యంలో జరిగిన దాడిలో అఫ్గాన్ పౌరులు మృతి చెందారు. దీనిపై అఫ్గాన్ క్రికెట్ బోర్డు తీవ్ర విచారం వ్యక్తం చేస్తోంది. ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోగా.. అందులో ముగ్గురు క్రికెటర్లు ఉన్నారు. పాక్టికా ప్రావిన్స్ రాజధాని శరణకు స్నేహపూర్వక మ్యాచ్ ఆడేందుకు వెళ్లిన ముగ్గురు క్రికెటర్లు కబీర్ అఘా, సిబ్గుతుల్లా, హరూన్ తిరిగి ఉర్గున్ వస్తుండగా ఈ దాడి జరిగింది. వారి మృతి అఫ్గాన్ అథ్లెట్, క్రికెటింగ్ ఫ్యామిలీకి తీరని లోటుగా భావిస్తున్నాం. మృతుల కుటుంబసభ్యులకు మా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాం. వచ్చే నెలలో జరగబోయే ముక్కోణపు టీ20 సిరీస్ నుంచి వైదొలగాలని నిర్ణయించుకున్నాం. ఇందులో పాకిస్థాన్ కూడా ఆడుతుండటంతోనే వైదొలుగుతున్నాం. ఘటనలో గాయపడిన పౌరులు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాం" అని ఏసీబీ వెల్లడించింది.









## ఫాస్టాగ్ వార్షిక పాస్‌నూ గిఫ్ట్‌గా ఇవ్వొచ్చు : ఎన్‌హెచ్ఏఐ

**ఢిల్లీ:** దేశ జాతీయ రహదారులపై అతి తక్కువ ఖర్చుతో ప్రయాణించేందుకు వీలుగా కేంద్రం తీసుకొచ్చిన ఫాస్టాగ్ వార్షిక టోల్‌పాస్‌ను మీకు నచ్చిన వారికి గిఫ్ట్‌గానూ ఇవ్వొచ్చని జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ పేర్కొంది. దీపావళి పండగ వేళ ఈ కొత్త ఆప్షన్‌ను తీసుకొచ్చింది. రాజమార్గ ద్వారా ఈ పాస్‌ను బహూకరించొచ్చని పేర్కొంది. యాప్‌లోని యాడ్ పాస్ విభాగంలోకి వెళ్లి మీరు గిఫ్ట్‌గా ఇవ్వాలనుకుంటున్న వ్యక్తి వాహన నంబర్, కాంటాక్ట్ వివరాలు ఇవ్వాల్సి ఉంటుందని పేర్కొంది. ఓటీపీ వెరిఫికేషన్ తర్వాత వార్షిక పాస్ యాక్టివేట్ అవుతుందని ఎన్‌హెచ్ఏఐ ఓ ప్రకటనలో తెలిపింది. దేశవ్యాప్తంగా 1150 టోల్‌ప్లాజాల వద్ద టోల్ ప్లాజాల వద్ద ఈ ఫాస్టాగ్ వార్షిక పాస్ చెల్లుబాటు అవుతుంది. ఒక్కసారి రూ.3 వేలు చెల్లించి ఈ పాస్ తీసుకుంటే ఏడాది పాటు లేదా 200 సార్లు (ఏదిముందైతే అది) టోల్‌ప్లాజాలు దాటొచ్చు. ఇది కేవలం ప్రైవేటు నాన్ కమర్షియల్ వాహనాలకు మాత్రమే వర్తిస్తుంది. రాజమార్గ యాప్‌లో యాక్టివేట్ చేసుకన్న రెండు గంటల్లో ఈ పాస్ యాక్టివేట్ అవుతుంది. ఈ ఏడాది ఆగస్టు 15న ఈ పాస్‌ను తీసుకురాగా.. రెండు నెలల్లో 25 లక్షల మంది ఎంపిక చేసుకున్నారు. 5.67 కోట్ల లావాదేవీలు జరిగాయని ఎన్‌హెచ్ఏఐ వెల్లడించింది.

### ఫొటో తీస్తే రూ.వెయ్యి




టోల్‌ప్లాజాల్లో అపరిశుభ్రంగా ఉన్న మరుగుదొడ్లపై ఫిర్యాదు చేసే వాహనదారుల ఫాస్టాగ్ అకౌంట్లకు రూ.1,000 బహుమతి రూపంలో జమచేస్తామని ఇటీవల ఎన్‌హెచ్ఏఐ ప్రకటించింది. ఈ రివార్డు అక్టోబరు 31 వరకు మాత్రమే అమలులో ఉంటుందని స్పష్టంచేసింది. జాతీయ రహదారుల వాడకందారులు 'రాజమార్గ్ యాత్ర' యాప్‌ను ఉపయోగించి తమ యూజర్‌నేమ్, లొకేషన్, వాహన రిజిస్ట్రేషన్ నంబర్, మొబైల్ నంబర్ వంటి వివరాలతో పాటు అపరిశుభ్రంగా ఉన్న టోల్‌ప్లాజా శౌచాలయాల చిత్రాలను అప్‌లోడ్ చేయవచ్చని అధికారిక ప్రకటన తెలియజేసింది. టోల్ ప్లాజా టాయిలెట్ల అపరిశుభ్రతపై ఈ పద్ధతిలో ఫిర్యాదుచేసే అర్హత గల వాహనదారులకు రూ. 1,000 ఫాస్టాగ్ రీఛార్జి రూపంలో అందిస్తామని ప్రకటన తెలిపింది.



## పొంచి ఉన్న వరుణుడు

ఆస్ట్రేలియా, టీమ్‌ఇండియా పెర్త్ వేదికగా నేడు జరిగే మొదటి వన్డే మ్యాచ్‌లో తలపడనున్నాయి. దాదాపు ఏడు నెలల విరామం తర్వాత టీమ్‌ఇండియా దిగ్గజ క్రికెటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ పునరాగమనం చేయబోతున్నారు. ఈ అద్భుత క్షణం కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అయితే ఫ్యాన్స్ ఆశలపై వరుణుడు నీళ్లు చల్లే అవకాశముంది! వర్షం వల్ల మ్యాచ్ మొత్తంగా రద్దయ్యే ప్రమాదం లేకపోయినప్పటికీ.. కాస్త ఆలస్యంగా ప్రారంభమయ్యే ఛాన్స్ ఉన్నట్లు తెలుస్తోంది. ఆస్ట్రేలియా వాతావరణ శాఖ నివేదిక ప్రకారం 63 శాతం వర్షం కురిసే అవకాశమున్నట్లు సమాచారం. స్థానిక సమయం ప్రకారం ఉదయం 11:30 గంటలకు మ్యాచ్ ప్రారంభమవుతుంది. అదే సమయంలో జల్లులు పడే అవకాశముంది. దీంతో మ్యాచ్ ఆలస్యంగా ఆరంభమయ్యే ఛాన్స్ ఉంది. అయితే క్రికెట్ అభిమానులకు శుభవార్త ఏంటంటే.. ఇక ఆ తర్వాత ఏ మాత్రం వాన పడదట!




## బయట అనుకొనేవేవీ మా మధ్య ఉండవు

### రో-కోపై శుభ్‌మన్ గిల్

భారత వన్డే చరిత్రలో కొత్త శకం మొదలైంది. నూతన సారథిగా శుభ్‌మన్ గిల్ మొదటి సిరీస్‌కు సిద్ధమయ్యాడు. ఇద్దరు సీనియర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీతో కూడిన టీమ్‌ను నడిపించనున్నాడు. ఆదివారం పెర్త్ వేదికగా తొలి వన్డే మ్యాచ్ జరగనుంది. ఈ క్రమంలో టీమ్‌ఇండియా కెప్టెన్ గిల్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడాడు. బయట వినిపించేవి మాటలు వేరు.. ఇక్కడ పరిస్థితులు భిన్నమైనవని తెలిపాడు. ఇంతకుముందు ఎలా నడిచేదో ఇప్పుడూ అలాగే కొనసాగుతుందని స్పష్టం చేశాడు. ఇది భారత జట్టు పరివర్తన దశగా పేర్కొన్నాడు. "రోహిత్, విరాట్‌కు ఉన్నంత అనుభవం మాకెవరికీ లేదు. వారి అనుభవాల నుంచి మేం నేర్చుకోవడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉంటాం. పిచ్ ఎలా ఉందనేది మాట్లాడి తెలుసుకుంటా. క్లిష్ట పరిస్థితుల్లో ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలో అడుగుతా. నా స్థానంలో ఉంటే వారు ఎలా ఆలోచిస్తారో గమనిస్తూనే ఉంటా. సహచరుల అభిప్రాయాలను తెలుసుకోవడం నాకు ఇష్టం. నాకు అర్థమైనదానిని బట్టి తుది నిర్ణయాలు తీసుకుంటా. బయట అనుకొనే మాటలేవీ మా దగ్గర ఉండవు. విరాట్, రోహిత్‌తో నాకు మంచి అనుబంధం ఉంది. ఏ అనుమానం ఉన్నాసరే నిర్భయంగా అడిగేస్తా. వారి నుంచి సలహాలు తీసుకుంటా. నాకు చెప్పేందుకూ వారు చికాకు పడరు. ఆ అనుభవమే నాకు, జట్టుకు ఎంతో విలువైంది. వారి ఆటను చూస్తూ పెరిగిన నాకు నాయకత్వం వహించే అవకాశం రావడం అద్భుతంగా అనిపిస్తోంది. ఇప్పటికీ ఆటపట్ల వారికి ఉన్న అభిరుచి నాకు స్ఫూర్తి. ఇలాంటి దిగ్గజ క్రికెటర్లను నడిపించనుండటం గొప్ప గౌరవం. కష్టాల్లో ఉన్నప్పుడు ఎలాంటి బిడియం లేకుండా వారి సలహాలు తీసుకుంటా. కెప్టెన్సీ ఉండటం వల్లే మరింత మెరుగ్గా బ్యాటింగ్ చేయగలనని అనిపిస్తుంది" అని గిల్ తెలిపాడు.

### వారి వారసత్వాన్ని కొనసాగిస్తా..

"వన్డే కెప్టెన్‌గా నాపై పెద్ద బాధ్యతలే ఉన్నాయి. ఎంఎస్ ధోనీ, విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ వారసత్వాన్ని కొనసాగించాలి. చాలా అనుభవాలను, పాఠాలను నేర్చుకోవాలి. జట్టును ఎలా ముందుకు తీసుకెళ్లాలనే దానిపై ఇప్పటికే రోహిత్, విరాట్‌తో చర్చించా. వారు భారత క్రికెట్‌లో అద్భుతమైన కల్చర్‌ను తీసుకొచ్చారు. తప్పకుండా వారి అనుభవాలు ఉపయోగపడతాయి" అని గిల్ వెల్లడించాడు.

## రోహిత్.. విరాట్ పునరాగమనంపై అభిమానుల ఆసక్తి

**టీమ్‌ఇండియా దిగ్గజ క్రికెటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఎట్టకేలకు మైదానంలో కనిపించనున్నారు. నేటి నుంచి (అక్టోబర్ 19) భారత జట్టు ఆస్ట్రేలియాలో పర్యటించనుంది. ఈ నేపథ్యంలో మూడు వన్డేలు, అయిదు టీ20 మ్యాచ్‌లు ఆడనుంది. ఇప్పటికే టెస్ట్, టీ20 ఫార్మాట్‌కు వీడ్కోలు పలికిన రోహిత్, విరాట్ ఆసీస్‌తో వన్డే మ్యాచ్‌లు ఆడనున్నారు. వీరిద్దరూ చివరిసారిగా ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీలో భాగంగా న్యూజిలాండ్‌తో టీమ్‌ఇండియాకు జరిగిన ఫైనల్ పోరులో కనిపించారు. అప్పటినుంచి వారు అంతర్జాతీయ క్రికెట్‌కు దూరంగా ఉన్నారు. తిరిగి దాదాపు 7 నెలల విరామం తర్వాత బ్యాట్ పట్టనున్నారు. ఈ నేపథ్యలో రో-కో పునరాగమనం కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.**




### కోహ్లీకి అద్భుతమైన అవకాశం

ఆసీస్ గడ్డపై విరాట్‌కు మంచి రికార్డే ఉంది. ఇప్పటివరకు అక్కడ 29 వన్డేలు ఆడిన అతడు 51.03 సగటుతో 1,327 పరుగులు చేశాడు. అతడు మరో 54 పరుగులు చేస్తే.. అద్భుతమైన రికార్డ్‌ను సొంతం చేసుకొనే అవకాశం ఉంది. కోహ్లీ ప్రస్తుతం వన్డేల్లో 14,181 పరుగులతో మూడో స్థానంలో ఉన్నాడు. అతడి ముందు కుమార్ సంగక్కర (14,234), సచిన్ తెందూల్కర్ (18,426) మాత్రమే ఉన్నారు. ఈ ఆసీస్ టూర్‌లో అతడు.. శ్రీలంక మాజీ ఆటగాడు సంగక్కరను అధిగమించే అవకాశముంది.

### రోహిత్ శర్మ కోసం..

ఆస్ట్రేలియాలో ఇప్పటివరకు 30 వన్డేలు ఆడిన రోహిత్ 53.12 సగటుతో 1,328 పరుగులు చేశాడు. ఇందులో అయిదు సెంచరీలు, నాలుగు హాఫ్ సెంచరీలు ఉన్నాయి. 171లి అతడి వ్యక్తిగత అత్యధిక స్కోర్. అలాగే ఇప్పటివరకు 499 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడిన రోహిత్, రేపు (అక్టోబర్ 19) ఆసీస్‌తో జరగబోయే పోరుతో 500వ మైలురాయిని అందుకోనున్నాడు. అతడి కంటే ముందు కేవలం నలుగురు భారత క్రికెటర్లు మాత్రమే ఉన్నారు. సచిన్ తెందూల్కర్ (664), విరాట్ కోహ్లీ (550), ఎంఎస్ ధోని (538), రాహుల్ ద్రవిడ్ (509).. రోహిత్ కంటే ముందు ఆ రికార్డ్ సొంతం చేసుకున్నారు. అలాగే రోహిత్ శర్మ ప్రస్తుతం వన్డేల్లో 344 సిక్స్‌లతో రెండో స్థానంలో ఉన్నాడు. అతడి కంటే ముందు షాహిద్ అఫ్రిదీ (351) మాత్రమే ఉన్నాడు. ఈ సిరీస్‌లో రోహిత్ మరో 8 సిక్స్‌లు కొడితే.. ఆ రికార్డును అధిగమించే అవకాశముంది. హిట్‌మ్యాన్ బ్యాట్‌తో చెలరేగి మరో సెంచరీ బాదితే.. అతడికది 50వ అంతర్జాతీయ శతకం అవుతుంది. భారత క్రికెట్ చరిత్రలో ఈ ఘనత సాధించిన తొమ్మిదో ఆటగాడిగా అతడు నిలిచే అవకాశముంది.

## గిల్ రాకతో నాపై ఒత్తిడి నిజమే

### కానీ.. ప్రేరణ పొందుతా : సూర్యకుమార్

ఇప్పుడు భారత జట్టుకు ఇద్దరే సారథులు. టెస్టులు, వన్డేలకు శుభ్‌మన్ గిల్ నాయకత్వం వహిస్తుండగా.. టీ20లకు సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్సీని నిర్వహిస్తున్నాడు. పొట్టి ఫార్మాట్‌లోనూ సూర్యకు గిల్ డిప్యూటీగా ఉన్నాడు. ఆస్ట్రేలియాతో టీ20 సిరీస్ కోసం ఎంపిక చేసిన జట్టుకు సూర్యనే నాయకత్వం వహిస్తున్నాడు. అయితే, రాబోయేకాలంలో ఒకే కెప్టెన్‌గా గిల్ రావడం ఖాయం. ఈ క్రమంలో గిల్ రాకతో తనపై ఒత్తిడి పెరిగిన మాట వాస్తవమేనని సూర్య అంగీకరించాడు. దానినుంచి ప్రేరణ పొంది అత్యుత్తమ ఆటతీరును ప్రదర్శించేందుకు ప్రయత్నిస్తానని వెల్లడించాడు. "గిల్ రెండు ఫార్మాట్లకు సారథిగా రావడం సంతోషంగా ఉంది. జట్టును అద్భుతంగా నడిపిస్తున్నాడు. అతడి రాకతో నాపై ఒత్తిడి పెరిగిందని చాలామంది అనుకుంటూ ఉంటారు. ఈ విషయంలో నేను అబద్ధం చెప్పను. ప్రతిఒక్కరికీ ఆ భయం, ఆందోళన ఉండటం సహజం. అయితే, దాని గురించి మరీ ఎక్కువగా ఆలోచించను. నా ఆటతీరుపైనే దృష్టిపెడతా. అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చేందుకు ప్రయత్నిస్తా. భవిష్యత్తులో గిల్‌కు టీ20 జట్టు పగ్గాలు అప్పగించినా సరే నేనేమీ ఇబ్బందిపడను. మా ఇద్దరి మధ్య మైదానంలోనే కాదు.. ఆవల కూడా సోదరభావం ఉంది. అతడు ఎలాంటి ప్లేయర్, ఎలాం టి వ్యక్తి అనేది నాకు తెలుసు. ఆ ప్రేరణతోనే మంచి క్రికెట్ ఆడేందుకు ముందడుగు వేస్తా. కాబట్టి, గిల్ విషయంలో నాకు సంతోషమే" అని సూర్య తెలిపాడు.




### పడిపోయిన ప్రదర్శన..

ఇంతకుముందు సూర్యకుమార్ క్రీజ్‌లోకి వస్తే ప్రత్యర్థి బౌలర్లకు చుక్కలు కనిపించేవి. కానీ, ఇటీవల మాత్రం అతడి నుంచి గొప్ప ప్రదర్శన చాలా అరుదుగానే అభిమానులు చూస్తున్నారు. మరోవైపు శుభ్‌మన్ గిల్ టెస్టుల్లో సారథ్యం చేపట్టిన తర్వాత బ్యాటర్‌గానూ అత్యుత్తమ ఆటతీరు ప్రదర్శించాడు. వచ్చే ఏడాది పొట్టి కప్ జరగనుంది. అప్పటివరకూ సారథిగా సూర్య ఉండాలంటే ఇప్పుడు ఆస్ట్రేలియాతో ఐదు టీ20ల సిరీస్‌లో రాణించాల్సిందేనని క్రికెట్ విశ్లేషకులు సూచించారు.

## ద్రవిడ్ నాకు స్నేహితుడే.. అయినా విభేదించా

### అజిత్ అగార్కర్



జట్టు ఎంపిక విషయంలో చర్చలు, విభేదాలు ఉండటం చాలా మంచిదని బీసీసీఐ చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ వ్యాఖ్యానించాడు. ఓ ఛానల్ సమ్మిట్‌లో అగార్కర్ పాల్గొన్నాడు. సెలక్టర్ల బాధ్యత అత్యుత్తమ జట్టును ఎంపిక చేయడమేనని.. అందుకోసం కొన్నిసార్లు కెప్టెన్, కోచ్‌తో విభేదించేందుకు సిద్ధమవుతామని అగార్కర్ వెల్లడించాడు. 2023లో సెలక్షన్ కమిటీ చీఫ్‌గా ఆయన బాధ్యతలు చేపట్టాడు. రోహిత్ శర్మ, రాహుల్ ద్రవిడ్‌తో కలిసి పనిచేసిన అజిత్.. ఇప్పుడు గౌతమ్ గంభీర్ – శుభమన్ గిల్‌తో కలిసి జట్టును ఎంపిక చేస్తున్నాడు. "విభేదించడం కూడా ఒక్కోసారి జట్టుకు మేలు చేస్తుంటుంది. అయితే, అది మంచి వాతావరణంలో జరగాలి. దీనివల్ల మెరుగైన ప్రత్యామ్నాయాలు వెలికితీసేందుకు ఆస్కారం ఉంది. మేం మంచి నిర్ణయం తీసుకోవడానికి వీలవుతుంది. ఇంతకు ముందు రాహుల్ ద్రవిడ్ ప్రధాన కోచ్‌గా ఉన్నాడు. అతడు నాకు చాలా మంచి స్నేహితుడు. అయితే, జట్టు ఎంపిక సమయంలో ఒకరినొకరం విభేదించుకున్న సందర్భాలూ ఉన్నాయి. జట్టుకు ఏది ముఖ్యమనేదే ఆలోచిస్తాం. అత్యుత్తమ 15 మందితో కూడిన టీమ్‌ను ప్రకటిస్తాం. కెప్టెన్లతోనూ ఇలానే వ్యవహరిస్తాం. ఇంతకుముందు రోహిత్‌తో.. ఇప్పుడు శుభ్‌మన్ గిల్. ప్రతిఒక్కరితోనూ చర్చ జరపాలనే కోరుకుంటాం. బెస్ట్ టీమ్‌ను ఇవ్వడం వల్ల కెప్టెన్, కోచ్ బాధ్యతలు మరింత సులభం అవుతాయి. ఈ చర్చల్లో వారు లేకపోతే అది మూరత్వమే అవుతుంది. మేం కొన్నింటిని అంగీకరించకపోయినా వారు తమ అభిప్రాయాలు చెప్పాలి. అలాగే కొన్నింటిని సమ్మతిస్తాం. ఇదంతా జట్టు సెలక్షన్‌లో భాగంగా జరిగే అతి సాధారణ ప్రక్రియ" అని అగార్కర్ స్పష్టం చేశాడు.




## డీప్‌ఫేక్ ముప్పుపై ఉడాయ్ 'సిటా' అస్త్రం..

డీప్‌ఫేక్ సాంకేతికత దుర్వినియోగం అవుతోంది. ఈ అధునాతన టెక్నాలజీ సాయంతో సైబర్ నేరగాళ్లు అమాయకుల నుంచి పెద్దఎత్తున సొమ్ము కొల్లగొడుతున్నారు. ఈ నేపథ్యంలో భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ ఉడాయ్ అప్రమత్తం అయ్యింది. దేశ డిజిటల్ గుర్తింపు వ్యవస్థను బలోపేతం చేయడానికి నడుం బిగించింది. ఇందుకోసం స్కీమ్ ఫర్ ఇన్నోవేషన్ అండ్ టెక్నాలజీ అసోసియేషన్ విత్ ఆధార్ పేరిట కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. డీప్‌ఫేక్‌లు, స్పూఫింగ్, ప్రజెంటేషన్ వంటి రూపాల్లో ఎదురయ్యే సైబర్ దాడులను అడ్డుకోవడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. ఇందుకోసం స్టార్టప్ సంస్థలు, విద్యాసంస్థలు, పరిశ్రమ వర్గాల సహకారం తీసుకుంటోంది. వీటిద్వారా అధునాతన బయోమెట్రిక్ టెక్నాలజీ, అథంటికేషన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా ప్రైవసీపై దృష్టిసారించనుంది. భద్రతాపరంగా ప్రపంచంలోనే అత్యుత్తమ వ్యవస్థను రూపొందించాలని భావిస్తోంది. ఇందుకోసం నవంబర్ 15 వరకు ఆయా వర్గాల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.



## వాట్సప్ మరో కొత్త ఫీచర్

### ఇకపై స్టేటస్‌కీ నోటిఫికేషన్


మెటాకు చెందిన ప్రముఖ మెసేజింగ్ యాప్ వాట్సప్ కొత్త ఫీచర్‌ను పరీక్షిస్తోంది. ఇందులో భాగంగా యూజర్లు.. తమకు ఇష్టమైన కాంటాక్టులు కొత్త స్టేటస్ పెట్టిన వెంటనే నోటిఫికేషన్ పొందగలరు. ఆండ్రాయిడ్‌లోని వాట్సప్ బీటా 2.25.30.4 వెర్షన్‌లో ఈ ఫీచర్ ట్రయల్ దశలో ఉందని వాబిటాఇన్ఫో తన బ్లాగ్ పోస్ట్‌లో పేర్కొంది. ఈ ఫీచర్‌ను దశలవారీగా విడుదల చేస్తూ యూజర్ ఎక్స్‌పీరియన్స్ పరిశీలిస్తున్నట్లు తెలిపింది. ఇదెలా పనిచేస్తుందంటే.. యూజర్లు తమకు కావలసిన కాంటాక్ట్ స్టేటస్‌ను ఓపెన్ చేసి పైభాగంలోని మూడు చుక్కలపై ట్యాప్ చేయాలి. అక్కడ 'Get notifications' ఆప్షన్‌ను ఎంచుకోవాలి. తర్వాత నుంచి ఆ కాంటాక్ట్ స్టేటస్ షేర్ చేసిన ప్రతిసారి యూజర్‌కు నోటిఫికేషన్ వస్తుంది. ఎంపిక చేసిన కాంటాక్ట్ స్టేటస్ పెట్టినపుడు.. వాట్సప్ వెంటనే అలర్ట్ పంపుతుంది. ఆ స్టేటస్‌లో ఇమేజ్ లేదా వీడియో ఉంటే నోటిఫికేషన్‌లో చిన్న ప్రివ్యూ కూడా కనిపిస్తుంది. యూజర్లు యాప్ ఓపెన్ చేయకుండానే కొత్త అప్‌డేట్ ఏంటో త్వరగా చూడొచ్చు. నోటిఫికేషన్లను ఎప్పుడైనా ఆపేసే వెసులుబాటు కూడా ఉంది. ఈ ఫీచర్ ద్వారా యూజర్లు తమకు ముఖ్యమైన కాంటాక్టుల అప్‌డేట్లను మిస్ అవకుండా చూడొచ్చు. అలాగే అలర్ట్ ఎనేబుల్ చేసిన విషయం ఆ కాంటాక్ట్‌కి తెలియదు. అంటే ప్రైవసీ దృష్ట్యా ఇది సురక్షితమైనదే.

www.rajamudranews.com
రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక

# ఓటీటీలోకి ఓజీ మూవీ



ఓజీ సినిమా ఓటీటీ విడుదల తేదీ ఖరారైంది. ఈ నెల 23 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుంది. పదేళ్ల క్రితం ముంబయిలో వచ్చిన తుపాను.. మళ్లీ తిరిగి వస్తున్నాడు అంటూ సదరు సంస్థ స్ట్రీమింగ్ వివరాలు ప్రకటించింది. ఈ మేరకు సోషల్ వేదికగా పోస్టర్ విడుదల చేసింది. తెలుగుతో పాటు పలు భాషల్లో స్ట్రీమింగ్ కానున్నట్టు తెలిపింది. పవన్ కల్యాణ్ హీరోగా దర్శకుడు సుజీత్ తెరకెక్కించిన ఈ గ్యాంగ్‌స్టర్ డ్రామా సెప్టెంబరులో థియేటర్లలో విడుదలైన సంగతి తెలిసిందే. ఓజస్ గంభీర గా పవన్.. అభిమానుల్లో జోష్ నింపారు. ఆయన లుక్స్, యాక్షన్, తమన్ అందించిన నేపథ్య సంగీతం సినీ ప్రియుల్ని విశేషంగా అలరించాయి. అనగనగా ఒక రాజు. అతనికి రక్షణగా నిలిచిన ఓ యోధుడు. కానీ, శత్రువుల ప్రార్థనలు ఫలించి ఆ యోధుడు పదేళ్లపాటు కన్నతండ్రి లాంటి రాజుకి దూరమవుతాడు. ఇదే అదనుగా శత్రు మూక చెలరేగిపోతుంది. ఆ రాజుని ఇబ్బందులపాలు చేసి, అతని రాజ్యాన్ని అక్రమ కార్యకలాపాలకి అడ్డాగా మార్చే ప్రయత్నం చేస్తుంది. రాజుకీ, రాజ్యానికీ కష్టం వచ్చిందని తెలిశాక ఆ యోధుడు మళ్లీ తిరిగొచ్చాడు. అతను వచ్చాక ఏం జరిగిందన్నదే ఈ కథ. ఇందులో రాజు సత్య దాదా (ప్రకాశ్‌రాజ్) అయితే, ఆయనకి రక్షణగా నిలిచిన యోధుడే ఓజస్ గంభీర అలియాస్ ఓజీ (పవన్ కల్యాణ్). సత్య దాదానీ, ఆయన రాజ్యం లాంటి పోర్ట్‌ని కష్టాల పాలు చేసేందుకు వచ్చినవాడే ఓమి (ఇమ్రాన్ హష్మీ). క్రూరమైన మనస్తత్వమున్న ఓమిని... ఓజీ (క్షుడ) ఎలా ఎదుర్కొన్నాడు ఓమి వెనక ఎవరున్నారు అసలు ఈ ఓజీ ఎవరు అతనికీ జపాన్‌లోని సమురాయ్ వంశానికీ సంబంధం ఏమిటి తన పేరు చెబితే ముంబయి అండర్ వరల్డ్ ఎందుకు గడగడలాడిపోతుంది పదేళ్ల తర్వాత కూడా మళ్లీ శత్రువుల్ని అదేస్థాయిలో భయపెట్టాడా లేదా అన్నది మిగతా కథ



# కావాలనే ఐటమ్ సాంగ్ చేశా : సమంత

ఇండస్ట్రీలో సమంత స్టార్ హీరోయిన్ గా ఏ రేంజ్ కు ఎదిగిందో అందరికీ తెల్సిందే. గత కొంతకాలంగా ఆమె సినిమాలకు దూరంగా ఉన్నా కూడా ఆమె స్థానాన్ని ఎవరూ భర్తీ చేయలేరని చెప్పవచ్చు. ఇక కొంతమంది హీరోయిన్లు తమ తప్పులను ఒప్పుకోవడానికి కష్టపడుతుంటారు. కానీ, సామ్ అలా కాదు.. తాను తప్పులు చేశానని బహిరంగంగా ఒప్పుకుంది. ఎన్డీటీవీ వరల్డ్ సమ్మిట్ లో పాలుపంచుకున్న సమంత తన మనసులోని భావాలను ఏ మాత్రం దాచుకోకుండా చెప్పుకొచ్చింది. తన కెరీర్ బిగినింగ్ నుంచి ఇప్పటివరకు తన జీవితంలో జరిగిన ప్రతి విషయం ప్రజలకు తెలిసేలాగే జరిగిందని, ట్రోల్స్ ఎన్ని వచ్చినా ఎదుర్కొని నిలబడినట్లు తెలిపింది. ప్రతి ఒక్కరికీ ఓ ఆశయమంటూ ఉండాలని, అందుకు తగ్గ సదుద్దేశం కూడా తోడవ్వాలని సమంత చెప్పుకొచ్చింది. ఇక సామ్ కెరీర్ ను మార్చిన విషయం పుష్ప లో ఐటెం సాంగ్ చేయడం. ఇది ఆమెపై ట్రోలింగ్ ను మరింత పెంచింది. నాగ చైతన్యతో విడాకులు తీసుకున్నాకా బయట ఎక్కడా కనిపించని సామ్.. ఊ అంటావా.. ఊఊ అంటావా సాంగ్ తో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అది పూర్తిగా తన డెసిషన్ అని చెప్పుకొచ్చింది. ఇప్పటివరకు మూస పాత్రలు చేసి కొత్తగా ఏదైనా చేయాలనుకున్నప్పుడు ఈ సాంగ్ ఆఫర్ వచ్చిందని, ఐటెంసాంగ్ చేస్తే ఎలా ఉంటుందో చూడడానికే ఆ సాంగ్ చేసినట్లు తెలిపింది. ఇక సామ్ తన బాడీ గురించి చెప్పుకొచ్చింది. తాను సెక్సీగా ఉంటానని నాకే అనిపించదని, అందుకే డైరెక్టర్స్ సైతం బోల్డ్ రోల్స్ ఇవ్వలేదని చెప్పుకొచ్చింది. ఇప్పటివరకు తన జీవితంలో ఎదురైన ఎదురుదెబ్బలను పాఠాలుగా గుర్తు చేసుకుంటూ ముందుకు సాగుతాననీ తెలిపింది. ప్రస్తుతం సామ్ వ్యాఖ్యలు నెట్టింట వైరల్ గా మారాయి.



# 'ఉస్తాద్ భగత్‌సింగ్'..

## హరీశ్ 12 ఏళ్ల కసి : నిర్మాత నవీన్




హైదరాబాద్: పవన్ కల్యాణ్ హీరోగా దర్శకుడు హరీశ్ శంకర్ తెరకెక్కిస్తున్న చిత్రం 'ఉస్తాద్ భగత్‌సింగ్'. దీపావళికి ఈ సినిమా అప్‌డేట్స్ వస్తాయేమోనని అభిమానులు ఎదురుచూస్తున్నారు. 'డ్యూడ్' మూవీ ప్రెస్‌మీట్‌లో పాల్గొన్న నిర్మాత నవీన్ యెర్నేనిని విలేకరులు దాని గురించి ప్రశ్నించగా స్పందించారు. "దీపావళికి అప్‌డేట్స్ ఇవ్వట్లేదు. కానీ, ఆ తర్వాత త్వరగానే ఇవ్వాలని అనుకుంటున్నాం. పాటలు, టీజర్, ట్రైలర్లను హరీశ్ పకడ్బందీగా రిలీజ్ చేస్తారు. 12 ఏళ్లుగా హరీశ్‌లో ఉన్న కసి ఈ సినిమాలో కనిపిస్తుంది" అని ఆసక్తి రేకెత్తించారు. మీ బ్యానర్‌లో ముందుగా సుకుమార్ దర్శకత్వంలో 'పుష్ప 3' వస్తుందా? మరేదైనా మూవీ ప్లాన్ చేశారా? అని అడగ్గా.. "ప్రస్తుతం రామ్ చరణ్ నటిస్తున్న 'పెద్ది' విడుదలైన తర్వాత.. సుకుమార్- చరణ్ కాంబినేషన్ మూవీ వచ్చే ఏడాది ఏప్రిల్‌లో ప్రారంభమవుతుంది" అని తెలిపారు. కోలీవుడ్ నటుడు ప్రదీప్ రంగనాథన్ హీరోగా కీర్తీశ్వరన్ తెరకెక్కించిన చిత్రం 'డ్యూడ్'. మమితా బైజు హీరోయిన్. నవీన్, రవిశంకర్ సంయుక్తంగా నిర్మించిన ఈ సినిమా తెలుగులోనూ శుక్రవారం విడుదలైన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో నవీన్‌తోపాటు ప్రదీప్, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు. 2012లో విడుదలైన 'గబ్బర్‌సింగ్' భారీ విజయం అందుకోవడంతో అదే కాంబోలో రూపొందుతున్న 'ఉస్తాద్ భగత్‌సింగ్'పై అంచనాలు నెలకొన్నాయి. పవన్ సరసన శ్రీలీల, రాశీఖన్నా సందడి చేయనున్నారు.

# స్టంట్స్ స్వయంగా చేయడమే ఇష్టం

## అందుకే 119 కుట్లు పడ్డాయి: విశాల్

తన శరీరానికి ఇప్పటివరకూ 119 కుట్లు పడ్డాయని నటుడు విశాల్ తెలిపారు. సినిమాల్లో ఎంతటి స్టంట్స్ అయినా స్వయంగా చేస్తానని, డూప్‌తో చేయించడం తనకు ఇష్టం లేదన్నారు. ఆయా యాక్షన్ సీక్వెన్స్‌ల్లో గాయాల కారణంగా అన్ని కుట్లు పడినట్టు తెలిపారు. తాజాగా పాల్గొన్న ఓ పాడ్‌కాస్ట్‌లో ఈ విషయాలు పంచుకున్నారు. నటుడు అర్జున్‌తో తనకున్న అనుబంధం, హిట్ మూవీ పందెం కోడి అవకాశం తనకెలా వచ్చిందో గుర్తుచేసుకున్నారు. ప్రస్తుతానికి ఈ పాడ్‌కాస్ట్ ప్రోమో వీడియో విడుదలైంది. మదగజరాజతో ఈ ఏడాది విజయాన్ని అందుకున్న విశాల్.. ప్రస్తుతం మకుటంలో నటిస్తున్నారు. ఇది ఆయనకు 35వ చిత్రం. దర్శకుడు రవి అరసుతో విభేదాలు తలెత్తాయని, దీంతో ఆ సినిమాని తానే తెరకెక్కించాలన్న ఆలోచనలో విశాల్ ఉన్నట్టు కోలీవుడ్ వర్గాల టాక్. నటి ధన్సికతో విశాల్ నిశ్చితార్థం జరిగిన సంగతి తెలిసిందే. త్వరలోనే ఏడడుగులు వేయనున్నారు.

# ద రాజాసాబ్ మరోమారు వాయిదా



ప్రభాస్ హీరోగా మారుతీ డైరెక్షన్ లో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై టి.జి. విశ్వప్రసాద్ నిర్మించిన ద రాజాసాబ్ మూవీ పలు రిలీజ్ డేట్స్ మార్చుకుంది. ప్రస్తుతం సంక్రాంతి కానుకగా జనవరి 9వ తేదీన ద రాజాసాబ్ రానుందని వినిపిస్తోంది. అయితే ఈ డేట్ కూడా మారే అవకాశం ఉందని, ఈ సినిమా ఏకంగా సమ్మర్ కు షిఫ్ట్ అవుతోందని ఓ టాక్ వినిపిస్తోంది. దీంతో ప్రభాస్ ఫ్యాన్స్ అయోమయంలో పడ్డారు. ఎందుకంటే ఈ సినిమాతో పాటు ప్రభాస్ అంగీకరించిన చిత్రాల పరిస్థితి ఏంటనీ అభిమానులు తికమకలో ఉన్నారు. అయితే ప్రభాస్ ఓ పక్కా ప్రణాళికతో ముందడుగు వేస్తున్నారని కాబట్టి ఏ లాంటి ఆందోళన చెందవలసిన పనిలేదని సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. ద రాజాసాబ్ పోస్ట్ పోన్ అవుతుందన్న మాట వినిపించడానికి ఓ కారణం ఉందని కొందరు చెబుతున్నారు. ఈ చిత్ర నిర్మాత టి.జి.విశ్వప్రసాద్ తమ నిర్మాణ సంస్థ ద్వారా టాప్ స్టార్స్ తో సినిమాలు తీసే ప్రయత్నంలో ఉన్నారు. అందులో భాగంగానే పవన్ కళ్యాణ్ తో ఓ మూవీ తీస్తాననీ అన్నారు. అంతేకాదు, పవన్ కళ్యాణ్ ఓజీ మూవీ రిలీజ్ అయినప్పుడు, సూపర్ హిట్ టాక్ తో సాగుతోన్న తమ మిరాయ్ మూవీని ఎత్తేసి మరీ ఓజీ షోస్ వేయడానికి ఓకే చెప్పారు విశ్వప్రసాద్. ఈ నేపథ్యంలోనే రాబోయే సంక్రాంతి బరిలో చిరంజీవి, అనిల్ రావిపూడి కాంబోలో వస్తోన్న మన శంకర వరప్రసాద్ గారు కోసం తమ ద రాజాసాబ్‌ను పోస్ట్ పోన్ చేస్తున్నారనీ వినిపిస్తోంది. అయితే ప్రభాస్ మాత్రం ద రాజాసాబ్‌ను పూర్తి చేసిన వెంటనే హను రాఘవపూడి డైరెక్షన్ లో తాను నటిస్తున్న ఫౌజీ షూటింగ్ లో పాల్గొంటారు. ఆ తరువాత నవంబర్ లో సందీప్ రెడ్డి వంగా డైరెక్షన్ లో స్పిరిట్ మూవీలో ప్రభాస్ నటించబోతున్నారు. ఈ రెండు సినిమాలలో ఒకటి 2026 ద్వితీయార్ధంలో, మరోటి 2027లో వస్తుందనీ అంటున్నారు. ఫౌజీ, స్పిరిట్ మూవీస్ తరువాత గతంలోనే తాను అంగీకరించిన కల్కి 2, సలార్2 చిత్రాలనూ ప్రభాస్ పూర్తి చేయవలసి ఉంది. వీటిలో ఓ సీక్వెల్ ను 2026లోనే ఆరంభిస్తారట. ఆ తరువాత 2027లో మరో సీక్వెల్ కు ముహూర్తం పెడతారు. అంటే ఈ సీక్వెల్స్ లో ఒకటి 2027లో విడుదలవుతుంది, మరోటి 2028లో వస్తుందని తెలుస్తోంది. వీటితో పాటే ప్రశాంత్ వర్మ డైరెక్షన్ లో ప్రభాస్ ఓ మూవీ చేయనున్నారని సమాచారం. ఇదిలా ఉంటే ద రాజాసాబ్ రిజల్ట్ ను బట్టి ఆ సినిమాకు కూడా సీక్వెల్ చేసే యోచన ఉందని అంటున్నారు.. ఇదే జరిగితే తెలుగునాట ప్రభాస్ సీక్వెల్ స్టార్‌గా జేజేలు అందుకొనే పరిస్థితి నెలకొంటుంది.



# దుల్కర్ సల్మాన్‌కు ఊరట..

## కారు రిలీజ్ చేయనున్న కస్టమ్స్ అధికారులు

దుల్కర్ సల్మాన్ కు కేరళ హైకోర్టులో ఊరట దక్కింది. నటుడి లగ్జరీ కారు స్వాధీనం విషయంలో వారంలోగా నిర్ణయాన్ని తెలియజేయాలని కస్టమ్స్ విభాగాన్ని న్యాయస్థానం ఆదేశించింది. హైకోర్టు ఆదేశం మేరకు దుల్కర్.. సంబంధిత పత్రాలను కస్టమ్స్‌కు అందజేశారు. కొన్ని షరతులతో దుల్కర్ కారు, మరొకరి విలాసవంతమైన కారునూ విడుదల చేసేందుకు కస్టమ్స్ అధికారులు నిర్ణయించారు. ఆయా కార్ల విలువలో 20 శాతాన్ని బ్యాంక్ గ్యారెంటీగా అందించిన తర్వాత రిలీజ్ చేయనున్నారు.



# రష్మిక జోరు

## వరుస హిట్లతో ముందుకు

ప్రస్తుతం పాన్ ఇండియా స్థాయిలో రష్మిక జోరు కనిపిస్తోంది. గతేడాది చివర్లో పుష్ప 2తో బాక్సాఫీస్ బరిలో మెరుపులు మెరిపించిన ఈ నాయిక.. ఈ ఏడాది ఇప్పటికే ఛావా, కుబేర చిత్రాలతో వరుస విజయాలు ఖాతాలో వేసుకుంది. ఇప్పడామె రెండు వారాల వ్యవధిలోనే వరుసగా రెండు సినిమాలతో సినీప్రియుల్ని మురిపించేందుకు సిద్ధమవుతోంది. ప్రస్తుతం ఆమె.. ఆయుష్మాన్ ఖురానా జంటగా ఆదిత్య సర్పోత్దార్ తెరకెక్కించిన బహుభాషా చిత్రం థామా. ముంజ్యా, స్త్రీ 2 విజయాల తర్వాత మడాక్ హారర్ యూనివర్స్ నుంచి వస్తున్న కొత్త సినిమా కావడం.. ఇందులో రష్మిక బేతాళ ప్రపంచానికి సుందరిగా కనిపించనుండటం అందరిలోనూ ఆసక్తి రేకెత్తిస్తోంది. మరి ఈ చిత్రంతో ఆమె మరో విజయాన్ని ఖాతాలో వేసుకుంటుందా లేదా తెలియాలంటే ఈ నెల 21వరకు వేచి చూడక తప్పదు. ఈ సినిమా విడుదలైన మరో రెండు వారాలకే ది గర్ల్‌ఫ్రెండ్‌గా మరో విభిన్నమైన చిత్రంతో సినీప్రియుల్ని పలకరించనుంది రష్మిక. ఇది ఆమెకి తొలి నాయికా ప్రాధాన్య సినిమా. రాహుల్ రవీంద్రన్ తెరకెక్కించారు. దీక్షిత్ శెట్టి హీరో. భావోద్వేగాలతో నిండిన ఆహ్లాదకరమైన ప్రేమకథతో రూపొందిన ఈ చిత్రం నవంబరు 7న విడుదల కానుంది. ఇటీవలే విజయ్ దేవరకొండతో లవ్ ట్రాక్‌÷ను ఎక్కించిన రష్మటిక సినిమాల్లో జోరు కొనసాగిస్తోంది.

Printed, Published and Owned by **RAVU RAJITHA**, Printed at **KAKATHIYA PRINTERS**, LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com